

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తీసుకొచ్చిన ఆడబిడ్డ నిధి పథకం త్వరలో ప్రారంభం కానుంది. ఈ పథకం ద్వారా 18 నుండి 59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు ప్రతి నెలా రూ.1500 అందించనున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 23.07.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 104 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


## పంటల వివరాలపై.. 'శాటిలైట్ సర్వే'

- ల్యాండ్ రీసర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ
- 47 లక్షలకు పైగా 'అన్నదాత సుఖీభవ' లబ్దిదారుల ఈకేవైసీ పూర్తి
- త్వరలో సాగునీటి సంఘాలతో నేరుగా వర్చువల్ సమావేశాలు
- యాప్ ద్వారా మత్స్యకారులకు సముద్ర మత్స్యసంపద వివరాలు
- వ్యవసాయం-అనుబంధ రంగాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- 4 గంటలకు పైగా లోతైన చర్చ - రైతులకు మేలు చేసేలా సూచనలు
- నీటి నిర్వహణపై జలవనరుల శాఖ అధికారులతోనూ సమీక్ష
- కాలువలు అన్నింటికీ నీటిని వదలాలని ఆదేశం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రమంతటా ఏ సర్వే నెంబర్ భూమిలో ఏ పంటలు పండిస్తున్నారనే పంటల వివరాలు శాటిలైట్ సర్వే ద్వారా సేకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వేతో సమగ్ర సమాచారం వెల్లడైందన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం, శాటిలైట్ సర్వే సమాచారం సరిపోల్చాలని స్పష్టం చేశారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతులకు దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. రైతు సేవా కేంద్రం నుంచి ఈ మేరకు నిరంతరం సూచనలు, సహకారం వారికి అందించాలన్నారు. రీసర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరిగిన తర్వాత వ్యవసాయ రికార్డులు కూడా నవీకరించాలని అధికారులను ముఖమంత్రి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటలకు పైగా వ్యవసాయం-అనుబంధ రంగాలపై లోతైన చర్చ జరిపి... రైతులకు మేలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, జలవనరుల శాఖ అధికారులతోనూ సమీక్ష నిర్వహించి నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు.

**రైతులకు సహకారానికి ఏఐ చాట్ బోట్ :** పంటల ప్రణాళిక, ఉత్పత్తులకు విలువ జోడింపు, రైతులకు సహకారం అందించేందుకు ఏఐ చాట్ బోట్ వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని వారికి అందేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఇప్పటి వరకూ 47,41,792 మంది రైతుల వివరాలతో అన్నదాత సుఖీభవ పథకం కింద ఈకేవైసీ పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇ-పంట ద్వారా అర్హులను గుర్తించాలని, రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఈ పథకం ద్వారా ఆర్ధిక సాయం అందాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

**సాగునీటి సంఘాలతో నేరుగా మాట్లాడతా :** వ్యవసాయరంగం అభివృద్ధికి తాను అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని... త్వరలో సాగునీటి సంఘాలతో వర్చువల్ సమావేశాలు మిగతా 2లో...

## 50 లక్షలకు పైగా ఇళ్లకు.. తొలి అడుగు

- తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక కార్యక్రమం.. సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్
- మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో ప్రతి ఇంటిని టచ్ చేసేలా సాంకేతికత మేళవించి కార్యక్రమం
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలను ప్రజలకు వివరిస్తూ గ్రామ గ్రామాన సాగుతున్న కార్యక్రమం
- ఏడాది పాలనపై ప్రజల యొక్క అభిప్రాయాలు, విలువైన సలహాలు తీసుకుంటున్న నాయకులు
- గత 18 రోజుల్లో 50 లక్షలకు పైగా ఇళ్లు కు టీడీపీ శ్రేణులు
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల నుంచి ఆత్మీయ స్పందన
- కార్యక్రమ నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డ్ ద్వారా నివేదికలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విధ్వంస పాలనకు చరమగీతం పాడి సుపరిపాలన వైపు అడుగుపెట్టి విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది తెలుగుదేశం ప్రభుత్వం. గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సూపర్ 6 పథకాల్ని ప్రజలకు అందిస్తోంది. ఓవైపు సంక్షేమాన్ని అందిస్తూనే మరోవైపు నవ్యాంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు విజన్ 2047తో దూసుకుపోతోంది తెలుగుదేశం ప్రభుత్వం. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న ఈ శుభ తరుణంలో ఏడాది ప్రజాపాలన గురించి, అందుకున్న విజయాల గురించి ప్రజలకు వివరిస్తూనే..పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు, ప్రభుత్వం అందిస్తున్న అని పథకాలు వారికి అందుతున్నాయా లేదా, ఇంకా ఈ ప్రజా ప్రభుత్వం నుంచి ప్రజలు ఏం ఆశిస్తున్నారు లాంటి అంశాల గురించి తెలుసుకునేందుకు సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది తెలుగుదేశం పార్టీ. జులై 2న కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంగళగిరిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

**50 లక్షలకు పైగా ఇళ్లు, అన్ని నియోజకవర్గాల్లో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం**

సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ సంక్షేమం, అభివృద్ధి విజన్‌ను వివరిస్తూ.. మిగతా 2లో...

## నాణ్యతగా ప్రసూతి సేవలు




- సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై దృష్టి
- సహజ ప్రసవాల పెంపునకు ప్రత్యేక పథకం
- పలు దశల్లో ప్రసూతి సేవల్ని అందించడానికి 1264 మంది సుశిక్షిత ప్రసూతి సహాయకులు
- ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉన్న 86 ఆసుపత్రుల్లో ప్రారంభం కానున్న పథకం
- విస్తృతం చేయాలన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ఈ దిశగా సుశిక్షితులైన మిడ్‌వైవ్స్ (ప్రసూతి సహాయకులు) ద్వారా సహజ ప్రసవాల్ని మిగతా 2లో...

## నాసిరకం మద్యంతో ప్రాణాలు తీశారు..

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం నిషేధిస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చి ఏం చేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఏరులై పారించిందని ఆరోపించారు. మద్య నిషేధం నినాదంతో అధికారంలోకి వైసీపీ వచ్చిందని.. కానీ ఆ హామీని జగన్ మర్చిపోయారని మండిపడ్డారు. అనేక మందికి నాసిరకం మద్యంతో లివర్ దెబ్బ తిని ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. మంగళవారం ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు



వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులు తినేశారు.. మరోవైపు జనం ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు పవన్ కల్యాణ్.

అయినా ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడ నిలబడ్డామని... ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహారించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించుకోవడానికి మిగతా 2లో...

## మహిళలకు గుడ్‌న్యూస్..



- ఆడబిడ్డ నిధిపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**నంద్యాల(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వడివడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకాన్ని కూడా త్వరలోనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే లక్ష్యంగా మిగతా 2లో...

## తోతాపూరి మామిడి రైతులకు.. తీపికబురు

- క్వింటాకు రూ.1,490 ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 50:50 నిష్పత్తిలో కేంద్రం, ఏపీ రాష్ట్రం మద్దతు ధరను చెల్లించనున్నాయి
- నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్న నగదు
- ఫలించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** తోతాపూరి మామిడి రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం అత్యధిక దిగుబడి రావడంతో మామిడి ధర తగ్గుముఖం పట్టింది. ఈ విషయాన్ని ముందే గ్రహించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చిత్తూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి రైతులతో, పల్ప్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. దిగుబడి ఎక్కువ ఉండటంతో మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకు అడుగుతున్నారని తెలుసుకున్న మిగతా 2లో...

## వారికి నెలకు రూ3 వేలు నిరుద్యోగ భృతి

**తిరుమల(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఇవాళ టీటీడీ పాలక మండలి సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు మీడియాకు వెల్లడించారు.



ఒంటిమిట్ట రామాలయంలో పూర్తిస్థాయి అన్నప్రసాద వితరణకు రూ.4.35 కోట్లు కేటాయిస్తున్నట్లు బీఆర్ నాయుడు పేర్కొన్నారు. ఆగస్టు నుంచి అక్కడ మూడు పూటలా భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామని చెప్పారు. మిగతా 2లో...

## జిల్లా, మండలాల పేర్లు మార్పు

- మంత్రివర్గం ఉపసంఘం ఏర్పాటు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దులు, గ్రామాల పేర్ల మార్పులు, చేర్పులపై సమగ్ర అధ్యయనం కోసం రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయం స్థానిక ప్రజలు, మిగతా 3లో...




## త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నోటిఫికేషన్



- రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత
- వర్క్‌షెడ్లతో పాటు సోలార్ లైటింగ్ యూనిట్ల ఏర్పాటు
- బీసీ హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి
- ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు
- ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ యువతకు ఉపాధి కల్పించండి అధికారులతో మంత్రి సవిత మిగతా 3లో...





# పంటల వివరాలపై.. 'శాటిలైట్ సర్వే'

(మొదటి పేజీ తరువాయి)

సైతం నిర్వహించి వారితో నేరుగా మాట్లాడతానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో దక్షిణ కోస్తాలోని కొన్ని జిల్లాలు మినహా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్‌లలో ప్రధాన ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని.. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రంలో 9.90 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతోందని చెప్పారు. అయితే, వర్షాధారంగానే పంటలు పండించేలా పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనిని సంబంధించి అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపి... అవగాహన కల్పించాలన్నారు. సీజన్ కాలాన్ని ముందుకు తీసుకురాగలిగితే తుపాన్లు, భారీ వర్షాల నుంచి రైతులు పంట నష్టపోకుండా జాగ్రత్త పడొచ్చని, అదే సమయంలో మరో పంటకు అవకాశం ఉంటుందని చెప్పారు. కరవు అనే మాట ఉండకూడదని, సమృద్ధిగా కురుస్తున్న వర్షపునీటి సద్వినియోగం ద్వారా ప్రాజెక్టుల నుంచి అతి తక్కువ నీటిని వాడుకునేలా ప్రణాళికలు ఉండాలన్నారు.

**ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గాలి :** రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగిస్తున్నారని... ఈ కారణంగా భూసారం తగ్గిపోతోందని... ఎరువులు, పురుగు మందులు ఏమేరకు వాడాలో రైతులకు వివరించి... వాటిని అధికంగా వినియోగించకుండా నియంత్రించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 36.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, అంతకుముందు ఏడాదితో 12 శాతం మేర తగ్గిందని అధికారులు వెల్లడించారు. అలాగే, 2024-25లో 1,733 మెట్రిక్ టన్నుల పురుగుమందులు రాష్ట్రంలో వినియోగం జరిగిందని తెలిపారు. అయితే, ఆర్గానిక్-బయో ఫెర్టిలైజర్ల వినియోగంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటలను చీడపీడల నుంచి రక్షించేలా ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ సిస్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. సాంకేతికతను వినియోగించుకుని పురుగు మందుల విస్తృతికి అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. విత్తనాలు, ఎరువుల విక్రయం పై చిట్టచివరి వం-కూ ట్రాకింగ్ జరగాలన్నారు. వరిలో కలుపు మొక్కల నివారణలో ప్రమాదకరమైన కెమికల్స్ వాడకంతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని అధికారులు తెలుపగా, ఎక్కడెక్కడ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయో సమాచారాన్ని సేకరించాలని...



కేసులు ఎక్కువ నమోదవుతున్న చోట్ల రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో అధిక ఆదాయం :** పురుగుమందులు, ఎరువులు వినియోగించకుండా పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇస్తే ఆయా ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉంటుందన్నారు. తద్వారా రైతులకు అధిక ఆదాయం వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు సంబంధించి టాటాతో త్వరలో ఒప్పందం చేసుకునేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. ఎన్‌పీఓపీ సర్టిఫికేషన్లతో జపాన్, తైవాన్ లాంటి దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చన్నారు. ఇండి గ్యాప్ సర్టిఫికేషన్‌తో పండ్లను 130 దేశాలకు ఎగుమతి చేసే అవకాశం లభిస్తుందన్నారు. విలువ జోడింపు ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలని సీఎం సూచించారు. చిత్తూరు జిల్లాలో మామిడి, మిర్చి లాంటి ఉత్పత్తులకు డిమాండ్ పెరిగేలా చూడాలన్నారు. దేశీయంగా డిమాండ్ లేని ఉత్పత్తులను సర్టిఫికేషన్ ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**నిరంతరం క్రాప్ హెల్త్ మోనిటరింగ్ :** రాష్ట్రంలో క్రాప్ హెల్త్ మోనిటరింగ్ నిరంతరం జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకోసం 42 ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. నీటి సంరక్షణ నిర్మాణాల ద్వారా భూగర్భజలాలు పెరిగేలా చూడాలని, 1000 టీఎంసీల మేర భూగర్భజలాలు ఉండాలనేది మన లక్ష్యమని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే కాలువలను పూడిక తీయించి అంతరాయం లేకుండా ప్రవాహాలు వెళ్లేలా చూడాలన్నారు. వ్యవసాయం- జలవనరుల శాఖ సమన్వయంతో పనిచేయాలని... అప్పుడే రైతులకు ఫలితాలు వస్తాయన్నారు. నీటి పంపిణీపై సాగునీటి సంఘాలతో కలిసి కసరత్తు చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించేలా చూడాలని, ప్రస్తుతం వ్యవసాయంతో పాటు 15 రంగాల్లో డ్రోన్లను వినియోగించేందుకు అవకాశం ఉందని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. డ్రోన్లతో సాగు సులభం అవుతుందన్నారు.

**పొగాకు, మామిడి కొనుగోళ్లపై కలెక్టర్లకు ఆదేశాలు :** ఈ సీజన్‌లో వ్యవసాయ అధికారులను ఇతర వ్యవసాయేతర విధులకు వినియోగించొద్దని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. హెచ్డీ బర్లీ, మ్యాంగో రైతులకు చెల్లింపులపైనా సీఎం మాట్లాడారు. మార్క్ ఫెడ్ నుంచి రెండు విడతల్లో బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆగస్టు 20 లోగా హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తోతాపురి మామిడి కొనుగోళ్లపై ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన ముఖ్యమంత్రి ఆగస్టు 15 లోగా మామిడి రైతులకు కూడా డబ్బులు చెల్లించాలని చెప్పారు. విలువ జోడింపులో భాగంగా కవర్ బ్యాగుల్లో పండించిన తోతాపురి మామిడి పళ్ల నాణ్యతను సీఎం పరిశీలించారు. టేబుల్ వెరైటీ పండించడం ద్వారా దేశీయంగా, పల్ప్ లాంటి ఉత్పత్తులతో విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కొనుగోళ్లు జరపని కంపెనీలపైనా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

**సూక్ష్మ సేద్యమే గేమ్ చేంజర్ :** ఉద్యాన పంటలకు సూక్ష్మ సేద్యం గేమ్ చేంజర్ అవుతుందని... ప్రస్తుతం 16.17 లక్షల హెక్టార్లలో దీని కింద సాగవుతుందని... మరింత విస్తరించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. నీళ్లు లేని చోట మైక్రో ఇరిగేషన్, నీటి వనరుల లభ్యత అధికంగా ఉన్న చోట్ల ఫ్లడ్ ఇరిగేషన్ అమలుకు అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమలో సూక్ష్మ సేద్యంతో పాటు కాలువల ద్వారా నీరిస్తే రైతులకు మరింత లాభదాయకంగా మారుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చిట్టచివరి ఆయకట్టువరకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా గుంటూరు ప్రాంతానికి సాగునీరు అందించాలన్నారు.

**అపార్ట్‌మెంట్ల చెంతకు మొబైల్ రైతుబజార్లు :** వ్యవసాయం-అనుబంధ ఉత్పత్తులు నగరాల్లో ఇంటి ముంగిటకు తీసుకువెళ్లి నేరుగా రైతులే విక్రయించేలా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గృహ సముదాయాల దగ్గర విక్రయాలకు అవకాశం కల్పించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగక్కుండా, తగ్గిపోకుండా ఈ ప్రక్రియ ఉపకరిస్తుందన్నారు. అలాగే అన్ని నియోజకవర్గ కేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో మొబైల్ రైతు బజార్లు ప్రవేశ పెట్టాలని చెప్పారు. 30 రోజుల్లోగా దీనిపై కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు

**నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే సబ్సిడీ :** మెరుగైన ఆదాయం వచ్చే వాణిజ్య పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఆక్వా ఉత్తత్పుల నాణ్యత విషయంలో రాజీ లేదని... ఉత్పత్తుల నాణ్యత అంతర్జాతీయ ఎగుమతులకు తగ్గట్టు ఉండాలన్నారు. చికెన్ వ్యర్థాలను ఫీడ్‌గా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆక్వా రైతులకే సబ్సిడీ విద్యుత్ అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. సముద్రంలో మత్స్య సంపద ఏ ప్రాంతంలో ఎక్కువ లభిస్తుందో మత్స్యకారులకు యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. సముద్రంలో ఉత్పత్తయ్యే సీవీడ్ ఎక్కువ మంది సాగు చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో వినియోగించడంతో పాటు, బయో ఫ్యూయల్‌గా కూడా సీవీడ్‌ను వినియోగించేలా అధ్యయనం జరగాలని చెప్పారు. ఉద్యానరంగంతో సమానంగా పశుపోషణకు, ఆక్వా ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. లైవ్ స్టాక్‌లో 15 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ఇకపై ప్రత్యేకంగా సమీక్షిస్తానని అన్నారు.

**'కోకో ముంజ్'పై ముఖ్యమంత్రి ప్రశంసలు :** సమీక్షలో కొబ్బరితో తయారు చేస్తున్న 'కోకో ముంజ్' సంస్థ ఉత్పత్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి... సంస్థ ప్రతినిధిని అభినందించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయం-అనుబంధ రంగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తోతాపూరి మామిడి రైతులకు.. తీపికబురు

(మొదటి పేజీ తరువాయి)



మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే ఈ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ మామిడిని 8 రూ కొనాలని, 4 రూ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తుందని తెలిపారు. కేజీ 12 రూ చొప్పున రైతులకు అందచేసే విధంగా చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఢీల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కలసి తోతాపూరి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించి సబ్సీడి నగదులో 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదును చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**మామిడి రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు :** మంత్రి అచ్చెన్నాయుడు అభ్యర్ధనని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం మంగళవారం తోతాపూరి మామిడి క్వింటాకు రూ. 1,490 ను కేంద్రం ప్రకటించింది. 50:50 నిష్పత్తిలో కేంద్రం, ఏపీ రాష్ట్రం మద్ధతు ధరను చెల్లించనున్నాయి. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కానుంది. ఈ విషయం పట్ల తోతాపూరి మామిడి రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలబడిన కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడు కి, మంత్రి అచ్చెన్నాయుడు కి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

**హర్షం వ్యక్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు :** తోతాపూరి మామిడి క్వింటాకు రూ. 1,490 ను కేంద్రం ప్రకటించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మామిడి రైతుల నష్టం రాకూడదని ముందుగానే గ్రహించి కేజీ మామిడిని 12 రూ లకు కొనుగొలు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేజీ మామిడికి 4 రూ సబ్సిడీ ని అందచేశామని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన ధరను మామిడి రైతులకు ఏపీ ప్రభుత్వం అందచేసిందని తెలిపారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన సీఎం చంద్రబాబునాయుడు , కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నాసిరకం మద్యంతో ప్రాణాలు తీశారు..




(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..? అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని వార్నింగ్ ఇచ్చారు పవన్ కల్యాణ్.

రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహరిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సీఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సీఎంకు చెప్పిన అనంతరేమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# 50 లక్షలకు పైగా ఇళ్లకు.. తొలి అడుగు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తమ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళు న్నారు. ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తున్నారు. అంతేకాకుండా... ఆయా కుటుంబాలకు అందుతున్న పథకాల గురించి కూడా తెలుసుకుని... ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి పథకాల్ని, కార్యక్రమాలను ఆశిస్తున్నారు లాంటి అంశాల్ని కూడా నమోదు చేసుకుంటున్నారు. మొత్తంగా ఈ 18 రోజుల్లో 50 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించి సరికొత్త రికార్డుని సృషించారు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు. తద్వారా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ మరోసారి నిరూపించినట్లైంది.

**సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యాలు**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు పింఛన్లు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, దీపం 2 పథకం వంటి వాటిగురించి ప్రజలకు వివరిస్తున్నారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు గురించి చెపుతున్నారు. పెట్టుబడుల ద్వారా మన యువతకు అందివస్తోన్న ఉద్యోగాకవకాశాలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్నది ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. రాబోయే నాలుగేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి చర్యలను వివరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలు ఇంకా ఎలాంటి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఆశిస్తున్నారో తెలుసుకుంటున్నారు.

మూడు ప్రాంతాలు.. మూడు కరపత్రాలు సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టింది తెలుగుదేశం పార్టీ. ఆయా ప్రాంతాల్లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి వివరిస్తూ, దీంతోపాటు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాల్ని కూడా ఒక కరపత్రం రూపంలో సిద్ధం చేసి ప్రజలకు అందించింది. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ....ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు విడివిడిగా కరపత్రాల్ని సిద్ధం చేసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చాలా స్పష్టంగా తెలిసేలా చేసింది తెలుగుదేశం పార్టీ.

**ప్రతీ ఒక్కరూ కచ్చితంగా డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొనాల్సిందే :** తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు. ఇక్కడ కార్యకర్తే అధినేత. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కకార్యకర్త ఉత్సాహంగా పాల్గొన్నాడు. అందుకే వారికి మరింత ప్రోత్సాహన్ని అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గారు మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మహానాడు కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

**మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం :** సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మంత్రి నారా లోకేష్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకే కార్యక్రమం మొదలైన దగ్గరనుంచి ఈరోజు వరకు ప్రతీరోజూ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ప్రతీ రోజూ మాట్లాడారు. వారిని ఎప్పటికప్పుడు మోటివేట్ చేస్తూ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారు.

ఉత్సాహంగా పనిచేసిన కార్యకర్తల్ని, నాయకుల్ని మంత్రి నారా లోకేష్ స్వయంగా అభినందిస్తున్నారు. మీ వెనుక నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ఏ చిన్న సమస్య రాకుండా టెక్నాలజీ ద్వారా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే తెలుసుకుని దాన్ని పరిష్కరిస్తున్నారు. మరోవైపు మంత్రులు కూడా దాదాపు 80 నుంచి 85 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కార్యక్రమాన్ని లోకేష్ రూపొందించారు.

**డోర్ టు డోర్ కార్యక్రమం జరుగుతున్న తీరుపై ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ :** సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యొక్క CUB (క్లస్టర్, యూనిట్, బూత్) నాయకుల దగ్గరనుంచి, కుటుంబ సాధికార నాయకులు, పొలిట్ బ్యూరో వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఎప్పటికప్పుడు SMSలు, IVRSల ద్వారా అలర్ట్ చేశారు. అంతేకాకుండా వారు ఎన్ని ఇళ్లకు వెళ్లారు అనే విషయాన్ని సాయంత్రానికి డ్యాష్ బోర్డ్ లో అప్డేట్ అయ్యేలా చూశారు. దీనిద్వారా తక్కువ రోజుల్లోనే ఎక్కువ ఇళ్లని కవర్ చేయగలిగారు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర పునర్నిర్మాణాన్ని తలకెత్తుకున్న తెలుగుదేశం ప్రభుత్వ నిబద్ధతకు ఈ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఒక అద్భుతమైన నిదర్శనం. అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు ప్రత్యక్షంగా తెలియజేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని మరింత పొందే విధంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరుగుతోంది.

## మహిళలకు గుడ్‌న్యూస్..

(మొదటి పేజీ తరువాయి)



సీఎం చంద్రబాబు ఆడబిడ్డ నిధి పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకంలో భాగంగా ప్రతి మహిళకు కూటమి ప్రభుత్వం నెలకు రూ. 1500 అందించనుంది. ఈ పథకం ప్రకారం 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న వారికి బ్యాంకు ఖాతాలో రూ. 1500 జమ చేయనున్నారు. అయితే ఈ పథకంపై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి కీలక ప్రకటన చేశారు.

ఆడబిడ్డ నిధిని కూడా త్వరలో ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. ఆడబిడ్డలకు పెళ్లి, ఉద్యోగం వచ్చే వరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధితో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చెప్పిన మాట చేసి చూపించే వ్యక్తి చంద్రబాబునాయుడు అని అభివర్ణించారు. మంగళవారం నంద్యాల జిల్లాలోని గడివేముల మండలం దుర్వేసిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, శాసన సభ్యురాలు గౌరు చరితా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను చాలామంది అవహేళన చేశారని... కాని ప్రజలు విశ్వసించారు, గెలిపించారని ఉద్ఘాటించారు.

**ఆలయాలకు రూ.10 వేలు: మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి :** దుర్వేసి గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామంలో సుంకులమ్మ గుడిని నిర్మిస్తామని మాటిచ్చారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఏపీలో ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నామని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయాల్లో ధూప దీప, నైవేద్యాలకు పూజారికి ప్రతినెల రూ. 10 వేలు ఇవ్వనున్నామని ప్రకటించారు. నంద్యాల జిల్లాలో 47 ఆలయాలకు రూ. 43 కోట్లు కేటాయించామని చెప్పుకొచ్చారు. కాల్వబుగ్గ ఆలయానికి రూ. 4కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల పుస్తకాలపై జగన్ ఫొటో వేయించుకున్నారని విమర్శించారు. రైతుల భూములను ప్రభుత్వ భూమి పేరుతో రుణం తీసుకోవాలని వైసీపీ కుట్ర చేసిందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆరోపించారు.

## నాణ్యతగా ప్రసూతి సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించే పథకానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

ప్రస్తుతం ప్రసవ సమయాల్లో ప్రభుత్వాసుపత్రుల్లోని స్టాఫ్ నర్సులే ప్రసూతి సేవల్ని అందిస్తున్నారు. వీరికి వివిధ అంశాలపై తగిన పరిజ్ఞానం, శిక్షణ కొరవడడంతో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈలోటును తీర్చేందుకు ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 18 నెలల పాటు ప్రసవానికి ముందు, ప్రసవ సమయం, ప్రసవానంతర సేవలకు సంబంధించిన అంశాలపై సమగ్ర శిక్షణ అందించి మహిళలు సహజ ప్రసవాల పట్ల మొగ్గు చూపేలా ఈ ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. తొలి విడతలో సంవత్సరానికి 600 నుంచి 6000 పైగా ప్రసవాలు జరుగుతున్న 86 ప్రభుత్వాసుపత్రుల్లో సుశిక్షితులైన 1264 మంది ప్రసూతి సహాయకుల్ని(మిడ్‌వైవ్స్) నియమిస్తారు.

వీరు వివిధ సమయాల్లో అందించాల్సిన సేవలు, విధులపై సమగ్ర జాబ్ చార్టును రూపొందించి ప్రసూతి సేవల నాణ్యతను ఈ పథకం కింద పెంచుతారు. ఔట్ పేషెంట్(ఓపీ) సర్వీసుల్లో భాగంగా గర్భవతుల పూర్వ ఆరోగ్య వివరాలు, ప్రస్తుత స్థితి, ప్రసవ విషయ పరిజ్ఞానం, సరైన పోషణ, వ్యాయామ అవసరాలు, సహజ ప్రసవాల వల్ల కలిగే లాభాలను శిక్షణ పొందిన మిడ్‌వైవ్స్ అందిస్తారు. లేబర్ రూముల్లో ప్రసవ నొప్పులకు సంబంధించిన విషయ పరిజ్ఞానం మరియు వాటిని భరించే విధానం, సహజ ప్రసవానికి అవసరమైన సలహాలు, ఏవైనా క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే అవకాశాల గుర్తింపు మరియు చేపట్టాల్సిన చర్యలపై వీరు తగు సలహాలిస్తూ అప్రమత్తంగా ఉంటారు. ప్రసవానంతరం తల్లి మరియు బిడ్డ ఆరోగ్య పరిస్థితి అంచనా, తల్లిపాల విశిష్టతను వివరించడంతో పాటు తల్లీబిడ్డల మధ్య మానసిక అనుబంధాన్ని పెంచడం, ప్రసవానంతరం ఎదురయ్యే సమస్యలపై దృష్టి పెడతారు.

ప్రస్తుత స్టాఫ్ నర్సుల విషయ పరిజ్ఞానం, శిక్షణా రాహిత్యాల వలన ప్రసవ సమయాల్లో డాక్టర్ల పాత్ర ఎక్కువగా ఉండడంతో...సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఒక అంచనా. కేంద్ర ప్రభుత్వ సాయంతో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ హెచ్ ఎం) కింద అమలయ్యే ఈ పథకానికి సంబంధించిన పలు అంశాల్ని లోతుగా చర్చించి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ పథకం విస్తృతిని పెంచాలని, గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాలు నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి కేంద్రంలోనూ ఒక సుశిక్షిత ప్రసూతి సహాయకురాలు(మిడ్‌వైఫ్) ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఈ పథకం కింద ఎంపిక చేసిన ప్రతి స్టాఫ్ నర్సుకు 18 నెలల పాటు సమగ్రమైన శిక్షణ అందించడానికి స్టైపెండ్‌తో కలిపి రూ. 2.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా.

2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం ప్రసవాల్లో 56.12 శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగినట్లు సమాచారం. ఇందులో ప్రభుత్వాసుపత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 41.40 శాతం సిజేరియన్లు కాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 67.71 శాతం మేరకు సిజేరియన్ ప్రసవాలు జరిగాయి.

## వారికి నెలకు రూ3 వేలు నిరుద్యోగ భృతి

(మొదటి పేజీ తరువాయి)

తిరుమలలో రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మించాలని నిర్ణయించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. దీనిపై సాధ్యసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా పరిపాలనా భవనం నిర్మించాలని నిర్ణయించామన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గంలో వచ్చేవారికి మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. చక్రతీర్థం, శిలాతోరణం సమగ్రాభివృద్ధికి ఆర్కిటెక్చరల్ కన్సల్టెన్సీ నియామకంపై చర్చించామని వివరించారు. 'వసతి గదుల కోసం వేచి ఉండేవారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం చర్యలు చేపడతాం. టీటీడీ తరఫున దేవాలయాల విస్తరణపై ఆలోచనలు చేస్తున్నాం. శ్రీవారి సేవకు సంబంధించి చాలా సంస్కరణలు తీసుకొస్తున్నాం. డిజిటల్, సామాజిక మాధ్యమాల ద్వారా భక్తులకు జరిగే మోసాలను నివారించే అంశంపై చర్చించాం. తిరుమల తిరుపతి దేవస్థానంలో 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయించాం' అని ఈఓ శ్యామలరావు వెల్లడించారు.

తిరుమలలో భక్తులు వేచి ఉండేందుకు అనువైన నిర్మాణాలు ఎలా చేయాలనే దానిపై కన్సల్టెన్సీ నియామకం చేపడతామని శ్యామలరావు తెలిపారు. నూతనంగా 700 మంది వేదపారాయణదారులకు ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. దేవాదాయశాఖ సిఫార్సు ప్రకారం 600 మందికి నిరుద్యోగభృతి కింద నెలకు రూ. 3 వేలు అందిస్తామని పేర్కొన్నారు ఎస్సీ, ఎస్టీ వెనకబడిన ప్రాంతాల్లో మూడు కేటగిరీల్లో భజన మందిరాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు విడుదల చేస్తామని తెలియజేశారు.

కడపలో వేల సంవత్సరాల చరిత్ర గల శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయనున్నట్లు శ్యామలరావు వివరించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నిర్మించిన 320 దేవాలయాలకు రూ. 79.82 లక్షలతో మైక్ సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయించామని చెప్పారు.

# పీ4 - జీరో పావర్టీపై ప్రత్యేక సర్వే

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పీ4 – జీరో పావర్టీ కార్యక్రమంపై ప్రత్యేక సర్వే చేయిస్తోంది. 12 ప్రశ్నలతో సర్వే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా యాప్ ద్వారా సర్వే చేస్తోంది. గ్రామ, వార్డ్ సచివాలయాల పరిధిలో ఈ సర్వే కొనసాగుతోంది. కుటుంబంలో ఎంతమంది ఉన్నారు.. ఇతర ప్రాంతాల్లో ఎవరున్నారు అనే అంశంపై సర్వే చేయిస్తోంది. ఆస్తులు ఎన్ని.. ప్రభుత్వం ఇస్తున్న పథకాల వివరాలపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు.



కార్, టూ వీలర్, భూమి ఉన్నాయా అని ప్రశ్నలు అడుగుతున్నారు. టీవీ ఫ్రిజ్..ఉన్నాయా…అని ప్రశ్నిస్తూ అధికారులు సర్వే చేస్తున్నారు. భవిష్యత్‌లో ఉద్యోగం కావాలా?.. బ్యాంక్ లోన్ కావాలా?..లేదా బిజినెస్ పెట్టుకుంటారా?. ఇలా పలు ప్రశ్నలని అడుగుతూ అధికారులు సర్వే చేస్తున్నారు. వ్యవసాయ రుణాలు, ఆదాయం వృద్ధి కోసం ఏమి కావాలనే అంశంపై ప్రశ్నలు అడుగుతున్నారు. వచ్చే నెల (ఆగస్టు) 5వ తేదీ వరకు ప్రభుత్వం సర్వే చేయనుంది. ఈ సర్వే అనంతరం ఆగస్టు 15వ తేదీన ఏపీ ప్రభుత్వం బంగారు కుటుంబాల ప్రకటన విడుదల చేయనుంది.

# జిల్లా, మండలాల పేర్లు మార్పు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల నేపథ్యంలో తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘంలో అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ సభ్యులుగా ఉన్నారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సరిహద్దుల పునర్వ్యవస్థీకరణలో పరిపాలనా సౌలభ్యం, భౌగోళిక సమీపత, చారిత్రక, సాంస్కృతిక అంశాలపై వీరు సూచనలు చేయనున్నారు.

ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని, సామాజిక, ఆర్థిక, అభివృద్ధి దృష్ట్యా సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలని మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ, సీసీఎల్ఏలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# మృతుని కుటుంబానికి అండగా ఉంటాము

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు 34వ డివిజన్ దేవాపురంలో కల్వర్ట్ స్లాబ్ కూలి అప్పారావు అనే కార్మికుడు మృతి చెందటం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా నిలుస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం దేవాపురంలో జరిగిన ఘటనకు సంబంధించి మృతి చెందిన అప్పారావు కుటుంబ సభ్యులను జీజీహెచ్ లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరామర్శించారు.



**ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ….** : దేవాపురంలో అనుకోని సంఘటన జరిగింది. అప్పారావు అనే కార్మికుడు సెంట్రింగ్ పనుల నిమిత్తం వచ్చి స్లాబ్ కూలి మృతి చెందటం అత్యంత బాధాకరం. వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి. చనిపోయిన అప్పారావుకు నా సంతాపం. వారి కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవటానికి కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు. దీని మీద సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చ

- **యుకెతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి**

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశం మరియు యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)ల మధ్య కొనసాగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టిఏ)అంశంపై మచిలీపట్నం ఎంపీ బాలశౌరి లోక్‌సభలో కీలకంగా ప్రశ్నించారు. ఈ రోజు పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్ర వాణిజ్య మంత్రిని ఉద్దేశించి ఆయన పలువురు అంశాలను ప్రస్తావించారు. ఎఫ్‌టిఏలో భారత ప్రభుత్వం ప్రవేశించిందా, ఒప్పందంలోని ముఖ్యమైన లక్షణాలు, ప్రజలకు ఇంకా దీనిని ఎందుకు తెలియజేయలేదన్న విషయాలపై ఎంపీ బాలశౌరి స్పష్టత కోరారు. అలాగే కార్బన్ బోర్డర్ సర్దుబాటు విధానం అంశంలో తుది ఫలితం ఏంటి, ఈ ఒప్పందం ఎప్పటి నుంచి



అమల్లోకి వస్తుంది, యుకె–ఆస్ట్రేలియా, యుకె–న్యూజిలాండ్ మధ్య ఒప్పందాలతో ఇది ఎలా భిన్నంగా ఉంటుంది అనే విషయాలను కూడా ప్రస్తావించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ వ్రాతపూర్వకంగా సమాధాన మిచ్చారు. మే 6, 2025న భారతదేశం మరియు యుకె ప్రధానమంత్రులు వాణిజ్య ఒప్పంద చర్చలు విజయవంతంగా ముగిసినట్లు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందం ఆధునికత, సమగ్రత మరియు మైలురాయిగా నిలిచేలా రూపొందించబ డిందని, ఇది వాణిజ్య సరళీకరణ, సుంకాల్లో రాయితీలు, లోతైన ఆర్థిక ఏకీకరణ లక్ష్యంగా పనిచేస్తుందని వివరించారు. వస్తువులకు సమగ్ర మార్కెట్ ప్రాప్యతను కల్పించడంతో పాటు, పారదర్శకత పెంపొందించి వ్యాపారంలో సౌలభ్యతను మెరుగుపరచడం ద్వారా దేశీయ సంస్కరణలను ప్రోత్సహించడమే ఉద్దేశమని తెలిపారు. ఒప్పందంపై అధికారికంగా సంతకం అయిన తరువాతే దాని వివరాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సున్నితమైన అంశాలన్నింటిని ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలిస్తుందని, దేశ ప్రయోజనాలకు నష్టం లేకుండా ఒప్పందం రూపొందించ బడిందని హామీ ఇచ్చారు. రెండు దేశాల సంతకాలు మరియు ఆమోదం అనంతరమే ఒప్పందం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రతి ఒప్పందం వాణిజ్య పరిస్థితులపై ఆధారపడి వేర్వేరుగా ఉండటంతో, యుకె ఇతర దేశాలతో చేసిన ఒప్పందాలతో భారత–యుకె ఒప్పందం భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాక, భారతదేశం–అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని, ఇది ఇంకా సంతకం కాలేదని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి స్పందిస్తూ, ప్రజల ప్రయోజనాలను ముందుంచే విధంగా కేంద్రం వ్యవహరించాలని, అంతర్జాతీయ ఒప్పందాల్లో పారదర్శకత ఉండాలని కోరారు.

# త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నోటిఫికేషన్

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత వెల్లడించారు. మంగళవారం సాయంత్రం అనకాపల్లి పట్టణంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవితను బీసీ వెల్ఫేర్, బీసీ కార్పొరేషన్, చేనేత, జౌళి శాఖాధికారులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మంత్రి సవిత డిపార్ట్‌మెంట్ల వారీగా అధికారులతో మాట్లాడారు. చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని తెలిపారు. ఆప్కో, లేపాక్షి షోరూమ్ ల ద్వారా అమ్మాయి పెంచాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అర్హులైన నేతన్నలకు వర్క్ షెడ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వర్క్ షెడ్లలో సోలార్ లైటింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు.



**హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడండి :** వర్షాకాలం నేపథ్యంలో బీసీ హాస్టల్ విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వేడి తాజా ఆహారం అందించాలన్నారు. హాస్టళ్ల అభివృద్ధికి సీఎస్సార్, డీఎమ్మార్ ఫండ్స్ సేకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీలను కలిసి ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధుల సమీకరించాలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు శాతం పెంపుదలకు ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు.

యువత ఉపాధికి యూనిట్లు నెలకొల్పండి

ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా యువతకు ఉపాధి కల్పనకు సబ్సిడీ రుణాలతో కూడిన యూనిట్లు నెలకొల్పాలని మంత్రి సవిత ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా ఏర్పాటు చేసే స్వయం ఉపాధి యూనిట్ల గురించి స్థానిక ఎమ్మెల్యేలకు తెలియజేయాలన్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ అవకాశాలను అత్యధిక మంది యువతకు వినియోగించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి శ్రీదేవి, ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ఏడీ పద్మ, లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో మేనేజర్ రమణమూర్తి, ఎంజేపీ స్కూళ్ల కన్వీనర్ వెంకటేశ్వర్లు, బీసీ కార్పొరేషన్ ఉండీ పెంటోజీరావు, చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి ఆర్వీ మురళీకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ ప్రభుత్వం మహిళలకు గుడ్ న్యూస్



**దర్శి (జర్నలిస్ట్ ఫైల్):** మన మంచి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో భాగంగా ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ బాబు , రవాణా శాఖామాత్యులు రాంప్రసాద్ రెడ్డి ఈ మేరకు సమీక్ష నిర్వహించి ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణానికి రంగం సిద్ధం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత ఐదేళ్లు వైసిపి ప్రభుత్వం లో ఆర్థిక వినాశనానికి కారణమై అన్ని రంగాలు విధ్వంసం అయ్యాయని విధ్వంసం నుండి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకు వెళుతూ ఇచ్చిన ప్రతి హామీని ఏడాది లోపే అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా మన కూటమి ప్రభుత్వం నడుస్తుంది. ఎంత ఆర్థిక భారం అయినప్పటికీ మహిళ లకు ఇచ్చిన మాటకోసం ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తుంది. ఇలా మన అభివృద్ధి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళ వలె ఆంధ్ర రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం రాష్ట్రం వీడి వెళ్లిన పరిశ్రమలు రప్పించడం ఆంధ్ర రాష్ట్రానికి స్వర్ణాంధ్రగా మార్చే లక్ష్యంగా మన మన కూటమి పాలన సాగుతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. సుపరిపాలన తొలి అడుగు లో ఇంటింటికి వెళుతుంటే ప్రతి ఇంట్లో కూటమి ప్రభుత్వ వెలుగులు వికసిస్తున్నాయని వారు తెలిపారు.

## హెూరాత్ర రుద్ర పారాయణం



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** వినుకొండ పట్టణంలోని పాత శివాలయంలో అర్చకసంఘం పురోహితుల ఆధ్వర్యంలో చేపట్టిన అహెూరాత్ర రుద్ర పారాయణం విజయవంతంగా జరిగింది. సోమవారం ఉదయం 10గంటల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు ఎంతో గొప్పగా నిర్వహించిన బ్రహ్మణులు, అర్చక పురోహితులు అందర్నీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఈ విధంగా చక్కటి హెూమాలు, యజ్ఞాలు, రుద్రహెూమం, లక్ష్మీగణపతి హెూమం చక్కగా నిర్వహించడం ఎంతో మంచివిషయం అన్నారు. వాటి ద్వారా రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, పల్నాడు జిల్లా అభివృద్ధిలో ముందుకు పోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా అన్నారు. అహెూరాత్ర రుద్ర పారాయణం గొప్ప ఫలితాలు ఇవ్వాలని, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబుకి బలం, అవకాశాలను ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు పురోహిత సంఘం సభ్యులు, రమణారావు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ముంపు పొలాలను పరిశీలించిన ఎంఎల్ఏ రామాంజనేయులు

**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాలను,వరద ఉదృతిని పరిశీలించుటకు ప్రత్తిపాడు శాసనసభ్యులు డా. బి.రామాంజనేయులు నియోజకవర్గంలో పర్యటించారు.ఇందులో భాగంగా వట్టిచెరుకూరు మండల పరిధిలోని వింజనంపాడు, చముళ్ళమూడి, సౌపాడు గ్రామాల లో నీట మునిగిన పొలాలను పరిశీలించారు.అనంతరం కాకుమాను మండల పరిధిలోని లింగంగుంట్లపాలెం,వల్లూరు, కొలిమర్ల,ప్రత్తిపాడు మండల పరిధిలోని వంగిపురం పెదనందిపాడు మండల పరిధిలోని పమిడివారిపాలెం గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.వరద ధాటికి ఉదృతంగా ప్రవహిస్తున్న గుంటూరు ఛానెల్ ,నక్క వాగు,కొండవాగు , అపాపురం ఛానెల్,కొలిమర్ల డ్రెయిన్ లను పరిశీలించారు.ఎంఎల్ఏ రామాంజనేయులు మాట్లాడుతూ త్వరలో శాశ్వత నివారణ చర్యలు చేపడతామని అందుకు మండలాల వారీగా రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.ప్రణాళిక బద్దంగా రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.నష్టపోయిన రైతులకు విత్తనాలకు కొరత లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు తయారుచేసి రైతాంగానికి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమం లో కాకుమాను మండల తహసీల్దార్ బి.వెంకట స్వామి,ఆయా మండలాల అధికారులు, కాకుమాను మండల పార్టీ అధ్యక్షులు మామిళ్ళపల్లి.రాం గోపాల్,జనసేన పార్టీ మండల అధ్యక్షులు గద్దం.శ్రీనివాసరావు,టీడీపీ



ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి. శివరాం ప్రసాద్,ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మెన్ నువ్వుల.సునీల్ చౌదరి,మాజీ సంగం డైరీ చైర్మన్ కొల్లా.వీరయ్య చౌదరి,రాష్ట్ర తెలుగు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి.వెంకటేశ్వరరావు, వట్టిచెరుకూరు సాంబశివరావు,లేమల్లేపాడు సర్పంచ్ పాతూరి.కృష్ణ, జిడీసీసీ వైస్ చైర్మన్ కుర్రి.సుబ్బారెడ్డి,మాజీ జడ్పీటీసీ బాగ్యరావు,కన్నెగంటి అంకమ్మరావు,పెద్ది.రవి బాబు,నల్లమోతు.పూర్ణ చంద్రరావు,కిరణ్,శంకర్,రవి బాబు,బసవేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లానింగ్

**వెల్దుర్తి (జర్నలిస్ట్ ఫైల్):** మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎమ్మెల్యే జూలకంటితో భేటీ అయ్యారు. పట్టణ సమగ్రాభివృద్ధికి నూతనంగా తయారు చేసిన మాస్టర్ ప్లానింగ్ ను అధికారులు ఆయనకు వివరించారు. మాస్టర్ ప్లానింగ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే.., అధికారులకు కొన్ని సూచనలు చేశారు. మాచర్ల పట్టణం, రాయవరం కలుపుకుని రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్సియల్, ఇండస్ట్రియల్, రోడ్స్ వంటివి జోన్స్ ఎక్కడెక్కడ ఉండాలి అన్నదానిపై తయారు చేసిన మాస్టర్ ప్లాన్ పై అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు.

**భావి తరాలకై నూతన జోనల్ మ్యాప్ సిద్ధం..!**

పెరుగుతున్న జనాభా దృష్ట్యా భావి తరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే జూలకంటి ఆదేశాల మేరకు నూతన టౌన్ ప్లానింగ్ లో జోన్స్ మార్పు



అనివార్యమైంది. దీనిపై మున్సిపల్ యంత్రాంగం ఎంతో క్లారిటీగా కసరత్తును మొదలుపెట్టింది. దీనికిగానూ 27 ఏళ్ల క్రితం ఉన్న టౌన్ ప్లానింగ్ ను పునరుద్ధరించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యంగా జనావాసాలకు దూరంగా పరిశ్రమలు, దగ్గరగా కమర్షియల్ బిజినెస్ సముదాయాల ఏర్పాటుకు ప్రస్తుతం ఉన్న టౌన్ ప్లానింగ్ లో మార్పులు చేయనున్నారు. అలానే ఉన్న రోడ్స్ ను కూడా వైండింగ్ చేయడానికి తగిన స్థలాన్ని కేటాయిస్తూ న్యూ ప్లానింగ్ లో మున్సిపల్ అధికారులు సబ్ డివిజన్ చేయనున్నారు. భవిష్యత్తులో మౌలిక వసతుల కల్పన అంశంలో ఎక్కడ రాజీపడకుండా పట్టణంలో మెరుగైన వసతులకై పక్కాప్రణాళికలతో నూతన టౌన్ ప్లానింగ్ ను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి అధికారులను ఆదేశించారు.

**ప్రజల చెంతకు న్యూ టౌన్ ప్లానింగ్..! :** మాచర్ల మున్సిపల్ అధికారులు తయారు చేయనున్న మాస్టర్ టౌన్ ప్లానింగ్ లో చేసిన మార్పులను ప్రజలకు తెలియజేయుటకు ప్రజాదర్బార్ తరహాలతో సభలు ఏర్పాటు చేయనున్నారు. అయితే ముందుగా ఉన్నతాధికారుల ఆమోదం మేరకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తయారు చేసి, అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తారు. ఆ తరువాత వారి ఆమోదంతో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ లో పొందుపర్చిన జోన్స్ పై ప్రజల అభ్యంతరాలను కోరుతారు. తరువాత ఫైనల్ గా చిన్న చిన్న మార్పులతో మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నట్లు మాచర్ల మున్సిపల్ కమిషన్ వేణుబాబు మీడియాకు తెలిపారు.

## సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం

**మార్కాపురం (జర్నలిస్ట్ ఫైల్):** మార్కాపురం నియోజకవర్గ అఖిలపక్ష పార్టీల సమావేశం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎలక్షన్స్ పోలింగ్ బూతుల రేష్నలైజేషన్ గురించి వివరిస్తు ఎలక్షన్ కమిషన్ సూచన మేరకు ఇకమీదట నుంచి ప్రతి పోలింగ్ బూతు 1200 ఓటర్స్ కు మించకుండా ఏర్పాటు చేయడం జరుగుతుంది అని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం , తర్లుపాడు , కొనకనమిట్ల , పొదిలి తాసిల్దారులు, పార్టీల ప్రతినిధులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి రాష్ట్ర పోలింగ్ బూత్ కార్యదర్శి పత్తి రవిచంద్ర, తెలుగుదేశం పార్టీ నుండి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ , బిజెపి పార్టీ నుండి ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి పివి



కృష్ణారావు , జనసేన పార్టీ నుండి విజయ నర్సింహారావు పాల్గొనడం జరిగింది.

## హెూంమంత్రి వ్యక్తిగత సహాయకుడిగా మోసానికి యత్నించిన నకిలీ వ్యక్తి అరెస్ట్

**విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర హెూంమంత్రి వ్యక్తిగత సహాయకుడిగా నటిస్తూ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని మోసం చేయడానికి యత్నించిన నకిలీ వ్యక్తిని విజయనగరం 1వ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన అల్లూరి అరవింద్ (21 సంవత్సరాలు) అనే యువకుడు ఈ మోసానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. జూలై 21న పోలీసు కార్యాలయానికి వచ్చిన అరవింద్, రిసెప్షన్ వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ అరుణను కలిసి, తాను రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత వ్యక్తిగత సహాయకుడినని పేర్కొన్నాడు. తక్షణమే జిల్లా ఎస్పీని కలవాల్సిన అవసరం ఉందని తెలిపాడు. కానిస్టేబుల్ స్పందిస్తూ, ఎస్పీ ప్రజా ఫిర్యాదుల విచారణలో ఉన్నారని, కొంత సమయం వేచిచూడాల్సి ఉంటుందని చెప్పింది. అయితే, గతంలో తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదని చెబుతూ, ఎస్పీని వెంటనే కలవనిస్తే మంచిదని, లేదంటే తాను తగిన విధంగా చూస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దౌర్జన్యం చేశాడు. ఈ సంఘటనపై మహిళా కానిస్టేబుల్ అరుణ 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి పోలీసులు అరవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో అతను నకిలీ వ్యక్తి అని, హెూంమంత్రి కార్యాలయంతో ఎటువంటి సంబంధం లేదని వెల్లడైంది. అతనిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజలు అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు.



## ఏపీ ప్రభుత్వంలో మరో కొత్త శాఖ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ప్రభుత్వంలో మరో కొత్తశాఖకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రూపొందించే లక్ష్యంతో డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో కొత్త శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణం, అటవీ శాఖలో ఒక సబ్జెక్టుగా ఉన్నప్పటికీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, రీసెర్చ్, ఇన్నోవేషన్‌లను వేగవంతం చేసేందుకు దీనిని స్వతంత్ర శాఖగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. జులై 19న అమరావతిలో సీఎం చంద్రబాబుఅధ్యక్షతన జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో ఈ ఆలోచనను వెల్లడించారు. రాష్ట్రాన్ని 2030 నాటికి భారతదేశ గ్రీన్ హైడ్రోజన్ రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో SRM యూనివర్సిటీ–APని నోడల్ ఏజెన్సీగా నియమించనున్నారు. 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి సామర్థ్యం, 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తితో 25 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కొత్త శాఖ SRM యూనివర్సిటీ–APతో కలిసి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లు, టెస్టింగ్ ఫెసిలిటీస్, స్టార్టప్‌లకు మద్దతు, 2030 నాటికి 2,000 మంది నిపుణుల శిక్షణతో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ స్కిల్లింగ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడంతో పాటు, జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లక్ష్యాలైన 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల నాన్–ఫాసిల్ ఇంధన ఉత్పత్తి, 2070 నాటికి నెట్–జీరో ఉద్గారాలకు ఐ నిర్ణయాలు దోహదపడనున్నాయి.

# రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలి

## నేనే రాబోయే పదేళ్లు సిఎంనని రేవంత్ ఎందుకన్నారో రాజగోపాల్‌రెడ్డికి తెలియదు

### క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి సూచనలు



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ క్షమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** 'నేనే రాబోయే పదేళ్ల ముఖ్య మంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఏ సందర్భంలో అన్నాడో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డికి తెలియదని కాంగ్రెస్ క్షమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి అన్నారు. సోమవారం విలేకరు లతో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, దానిని కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని సూచించారు. పదేళ్లు సిఎంగా ఉంటాననే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. పార్టీ విషయాలు బహిరంగంగా మాట్లాడొద్దు అని హితవు పలికారు. ముఖ్యమంత్రిగా మరో పదేళ్లు తానే ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాజకీయ దుమారం రేపింది. ముఖ్యమంత్రి పదవి ఆశించే అనేక మంది కాంగ్రెస్ నాయకులకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్షంను కాదు స్వపక్ష నేతలను సవాల్ చేసేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్రంలోని సీనియర్ నాయకులు వారి అంతరంగికుల వద్ద ఈ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మండిపోతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏలాంటి భేషజాలు లేకుండా బహిరంగానే సామా జిక మాధ్య మాల వేదికగా తీవ్రంగా స్పం దించారు. రేవంత్ ప్రక టన కాంగ్రెస్ విధా నాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సహించరని రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతికి దారితీస్తున్నాయి. ఇప్పటికే కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పలువురు నేతలు స్పందించి కౌంటర్ ఇవ్వగా, తాజాగా మల్లు రవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడినతీరు మరింత అగ్గికి ఆజ్యం పోసేలా తయారైంది.

## రాజకీయ నాయకులు అసభ్యపదజాలం ఉపయోగించడం తగదు

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** పెద్దల సభలోని సభ్యుల ప్రవర్తన వారి విజ్ఞతకు వదిలేస్తున్నానన్నారు. శాసనమండలి సభ్యులు ఇలా మాట్లాడవచ్చా? ఇలా దాడులు చేయవచ్చా అనేది వారే ఆలోచన చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ అన్నారు. ఎమ్మెల్సీలు కవిత, తీన్మార్ మల్లన్న పరస్పర ఫిర్యాదులపై సోమవారం ఆయన స్పందించారు. సభలో జరిగే వ్యవహారాలపై తక్షణం చర్యలు ఉంటాయని కానీ బయట జరిగే అంశాలపై మన పరిధి మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఇలాంటి చర్యలతో వ్యక్తిగతంగా వారి గౌరవంతో పాటు పెద్దల సభ గౌరవం కూడా పోతుంద న్నారు రాజకీయ నాయకులు అసభ్య పదజాలం వీడనాడాలని గుత్తా సుఖేందర్ సూచించారు. మాట్లాడే భాషపై ఎవరైనా కూడా వ్యక్తిగతంగా ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఈ పద్ధతి రాష్ట్ర రాజకీయాలకు, ప్రజాప్రతి నిధులకు మంచిది కాదని మన భవిష్యత్ తరాలకు చెడుమాటలను నేర్పించే పరిస్థితి ఉండకూడదన్నారు. కొంత మంది మాట్లాడే అసభ్య మాటలకు పక్కనున్న కొంతమంది జిందాబాద్‌లు కొట్టవచ్చు కానీ ప్రజలు హర్షించ దన్నారు. ఈ విధానం మార్చుకోవాల్సిన అవసరం అన్నారు. తిడితేనే రాజకీయ నాయకులం అవుతామనే పద్ధతి మార్చుకోవాలన్నారు. రాజకీయాల్లో అనుభవం ఉండి మంత్రులుగా ఎదిగిన వారు కూడా ఇలాంటి అసభ్యపదజాలం వాడటం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రతిపక్ష నేతలతోపాటు అధికారపక్షం కూడా హుందాతనంతో వ్యవహరించాలని సూచించారు.




జిఒ నంబర్ 49ను వ్యతిరేకిస్తూ ఆదిలాబాద్‌లోని ఉట్నూరులో బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నేతలు

## ఆదిలాబాద్ బంద్ ప్రశాంతం

### జిఒ నంబర్ 49ను రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ అటవీ సంరక్షణ పేరిట కేంద్రం తీసుకువచ్చిన జిఓ 49ను వ్యతికేకిస్తూ ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు సోమవారం జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా ఆర్టీసీ బస్సుల రాక పోకలకు అంతరాయం కలిగింది. బంద్‌లో భాగంగా ఆదివాసీల హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) పలుచోట్ల శాంతియుతంగా ఆందోళనలు చేబట్టింది. బంద్ ప్రభావం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఉట్నూరులో ఎక్కువగా కనిపించింది. ఈ రెండు చోట్ల బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆదివాసీలు ఎక్కువగా వుండే ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల్, నిర్మల్‌లో బంద్ ప్రభావం పాక్షికంగా కనిపించింది. బంద్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఆర్టీసీ బస్సులను డిపోల నుంచి బయటకు రాకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బంద్‌కు నాయకత్వం వహించిన ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జిఓ నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ఆది వాసీలు తమ జీవనాధారాన్ని కోల్పోతారని వారు తెలిపారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పేరిట తమ జీవితాలను నాశనం చేయవద్దని వారు కేంద్రాన్ని కో రారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తమ విషయంలో అన్యాయంగా ఆలోచిస్తే పోరాటం ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. కాగా బంద్ సందర్భంగా వ్యాపారాలు, విద్యా సంస్థలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూతపడ్డాయి.

## అల్లోపతి వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లపై టిఎంసి తనిఖీలు.. కేసులు నమోదు

**హైదరాబాద్, జులై : 22(జర్నలిస్ట్‌ఫైల్):** కొంతకాలంగా రాష్ట్రంలో నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు కొనసాగిస్తోంది. ఎక్కడ అనుమానం వచ్చిన మెడికల్ కౌన్సిల్ అక్కడికి వెళ్లి దాడులను నిర్వహిస్తోంది. అందులో భాగంగా అల్లోపతి వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై టిఎంసి సోమవారం దాడులు నిర్వహించింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కె మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ డి లాలయ్య కుమార్ ఆదేశాల మేరకు సోమవారం హాయత్‌నగర్ మండలం పరిధిలో అనధికారికంగా అల్లోపతి వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లపై నిర్దిష్ట స్థావరాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనధికారిక వైద్య నియంత్రణ పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్టు టిఎంసి వైస్‌చైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్, డాక్టర్ కెయుఎన్ విష్ణు, విజిలెన్స్ అధికారి రాకేష్ తెలిపారు. సూర్యాస్ హాస్పిటల్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్ పేరుతో బిఎఎంఎస్ చదివిన డాక్టర్ ఉమాకాంత్ అల్లోపతి వైద్యం చేస్తున్నట్టు గుర్తించారు. శ్రీ విజయ బ్రహ్మేంద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో బ్రహ్మేంద్ర ఆధునిక వైద్య సేవలు నిబంధనలకు వ్యతిరేకంగా చికిత్స అందిస్తున్నారు. హనుమాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో ఇంటర్మీడియట్ చదివి అర్హతలేని వినోద్ ఆధునిక వైద్యసేవలు అందిస్తున్నట్టు టిఎంసి బృందం గుర్తించింది. శ్రీసాయి పాలీ క్లినిక్ పేరుతో బిహెచ్‌ఎంఎస్ చదివిన డాక్టర్ కెపిఎస్ ప్రసాద్ ఆధునిక వైద్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు. బాలాజీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో రాంబాబు వైద్యపరంగా అనధికారికంగా సేవలందిస్తున్నట్టు టిఎంసి వైద్యుల బృందం గుర్తించింది. నకిలీ వైద్యులపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఎన్ఎంసి 34,54, టిఎస్ ఎంపిఆర్ 22, బిఎన్ఎస్ 318, 319 చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు టిఎంసి వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల ద్వారా టిఎంసి ప్రజారోగ్య పరిరక్షణ కోసం కట్టుబడి ఉందని చాటిచెప్పినట్టయిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై మరింత చట్టబద్ధ చర్యలు చేపట్టనున్నట్లు టిజిఎంసి స్పష్టం చేసింది.

## ప్రమోషన్లకు అడ్డంకిగా ఉన్న అడ్వకసీ ఉత్తర్వులను ఉపసంహరించాలి

### ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదలీలు చేపట్టాలి

### ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో పనిచేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల ప్రమోషన్లకి అడ్డంకిగా ఉన్న అడ్వకసీ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌సి, ఎస్‌సి ఉపాధ్యాయ సంఘం టిఎస్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాలు ఐక్యమై ఒకే బలమైన సంఘంగా ఏర్పడాలని భావించి సోమవారం హైదరాబాద్‌లో సమావేశమైన సంఘాలు ఎస్‌సి, ఎస్‌సి ఉపాధ్యాయ సంఘ: తెలంగాణ స్టేట్‌గా ఏర్పడినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులు ఐక్యంగా కలిసి పనిచేసి, సంఘాన్ని బలోపేతం చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవాలని నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ నూతన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెంట అంజయ్య తెలిపారు. రెండు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాలు ఐక్యమై, ఏకీకరణ చెంది, ఒకే బలమైన సంఘంగా ఏర్పడి.. మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే, భారతరత్న బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్, సావిత్రి బాయి పూలేల ఆశయ సాధన కొరకు పనిచేయాలని తీర్మానించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వెంటనే ప్రమోషన్లు, ట్రాన్స్ ఫర్లు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల ప్రమోషన్లకు అడ్డంగా ఉన్న అడ్వకసీ ప్రభుత్వ ఉత్తర్వును నంబర్ 2ను, మెమో నంబర్ 26559ను రద్దు పర్చాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాల ఏకీకరణ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని సామ్రాట్ అశోక భవనంలో నిర్వహించి ఏకగ్రీవంగా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర అక్యక్షులుగా తొంట సత్యనారాయణ (యాదాద్రి భువనగిరి జిల్లా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా సూర్యదేవర దానయ్య (రంగారెడ్డిజిల్లా), చాగంటి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెంట అంజయ్య(సిరిసిల్ల జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా నాంది సుశీల్ కుమార్(నిజామాబాద్ జిల్లా) రాష్ట్ర ప్రధాన సలహాదారుగా బండారు రవి వర్ధన్, రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పారునంది రామయ్య, మోతె సాయన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నూతన రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ తెలిపారు.

## జిఓ 49ని నిలుపుదల చేసిన ప్రభుత్వం

### ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 22:** రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందించింది. కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలును నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జీవో 49 ద్వారా కొమురంభీమ్ ఆసిఫాబాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది!



## కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సిపిఐ నాయకుల సంతాపం

### సానుభూతి తెలిపిన నారాయణ, కూనంనేని

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతానందన్ బాల్యంలోనే చదువు మానేసి కార్మికుడిగా పని చేస్తూ కార్మిక ఉద్యమ నాయకుడిగా ఎదిగారన్నారు. ట్రావెన్ కోర్ సంస్థానంలో భూముల పోరాటం చేసి జైలుకెళ్ళి రాజకీయ జీవితంలో అడుగుపెట్టారని కూనంనేని అచ్యుతానందన్ సేవలను కొనియాడారు. కమ్యూనిస్టు యోధుడు, ఈతరానికి ఆదర్శవంతులు కేరళ మాజీ ముఖ్య మంత్రి కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం, వారికుటుంబసభ్యులకు నాసానుబూతిని తెలిపారు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ. కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సంతాపం తెలిపారు. కేరళలో నిరుపేద కుటుంబంలో జన్మించి లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు ప్రపంచంలోనే కీలక ఘట్టాలను చూసిన వ్యక్తి అచ్యుతానందన్ అనిని వారు గుర్తు చేసుకున్నారు. అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## 24న ఢిల్లీలో సిఎం రేవంత్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజంటేషన్

### డా. మల్లు రవి

**హైదరాబాద్, జులై : 22(జర్నలిస్ట్‌ఫైల్):** రేవంత్‌రెడ్డి కులగణన, బిసి రిజర్వేషన్ అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఢిల్లీలో ఇవ్వబోతున్నారని ఎంపి మల్లు రవి తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపి డా. మల్లు రవి. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నాడు ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లి కార్జున ఖర్గేలతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు సమావేశమై రాష్ట్రంలో చేపట్టిన కులగణన,బీసీ లకు 42శాతం రిజర్వేషన్ అంశాలపై వారికి వివరించి వారి సలహాలను, సూచనలను స్వీకరించ నున్నారని తెలిపారు.అనంతరం సాయంత్రం 5 గంటలకు కులగణన, బిసి రిజర్వేషన్లపై ఇందిరా భవన్ లో దేశంలోని కాంగ్రెస్ ఎంపీలందరికీ సిఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్ లో చర్చించాలని కోరనున్నారని తెలిపారు. పార్లమెంట్ లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరపాలని పట్టుబడితే పదేపదే సభను వాయిదా వేస్తున్నారని చెప్పారు.

## సిఎంగా రేవంత్ కనిష్టంగా పదేళ్లు.. గరిష్ఠంగా ఎన్నేళ్లయినా..!

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** రేవంత్‌రెడ్డి కనిష్టంగా పదేళ్లు ముఖ్యమంత్రి గా ఉంటాడు గరిష్టం గా సిఎంగా గా ఎన్నేళ్లైనా ఆపదవిలో ఉండొచ్చు అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మాదే అని ధీమా వ్యక్తం చేశార.31 జిల్లాపరిషత్ లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. పాపం హరీష్ రావును చూస్తుం టే జాలేస్తుందని తుక్కు తుక్కై ఫామ్ హౌస్ గ్యారేజ్‌లో పడి ఉన్న కారు కు మళ్లీ గాలికొట్టేందుకు ఆయన అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో కారు టైర్లగాలిపోయింది, పార్లమెంట్ ఎన్నికల్లో ఇంజన్ పనికి రాకుండా పోయిందని భాష్యం చెప్పారు.బిఆర్ఎస్ పార్టీ బోరుకొచ్చింది దాన్ని బాగుచేయలేరు పాత ఇనుప సామాను కు కూడా పనికి రాదని అపహాస్యం చేశారు. హరీష్ రావు మాత్రం ఫామ్ హౌస్ లో మామతో కలిసి కూర్చుని దొంగ సర్వేలు తయారు చేసుకు వచ్చి ప్రచారం చేస్తున్నాడని ఆయన అన్నారు.31 జిల్లా పరిషత్ లకు 16 నుంచి 18 జిల్లా పరిషత్ లు బిఆర్ఎస్ గెలుస్తుందని హరీష్ రావు కాకమ్మ కబుర్లు చెపుతున్నాడని ఆయన అన్నారు. హరీష్ రావు ముందు సిద్దిపేటజిల్లా పరిషత్ గెలువు అని సవాల్ విసిరారు. నీ దగ్గర జడ్పీటీసీలు గెలిపించుకో చాలు అని ఆయన అన్నారు. హరీష్ రావు కు గత అసెంబ్లీ ఎన్నికల్లో 82 వేల మెజార్టీ వచ్చిందని పార్లమెంటు ఎన్నికలకు వచ్చే సరికి సిద్ధిపేట లో బిఆర్ఎస్ అభ్యర్థి కి 40 వేల ఓట్లు తగ్గాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ సెగ్మెంట్లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఇప్పుడు 26,252 ఓట్లు తగ్గాయి.,అంటే పార్లమెంటు ఎన్నికల నాటికి మీ గ్రాఫ్ సగానికి సగం పడిపోయిందని అన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ పరిస్థితి ఏమిటో మీరే అర్థం చేసుకోండని అన్నారు. చచ్చిన పాము బిఆర్ఎస్ పార్టీ మీరెన్ని లేపనాలు పూసినా ఉపయోగం లేదు.. అది లేవదు అని అన్నారు. తెలంగాణ లో బిఆర్ఎస్ పార్టీకి ఒక్క జడ్పీ కూడా దక్కే అవకాశం లేదని ఆయన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని జడ్పీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని చెప్పారు.

## కల్లు దుకాణాలను బంద్ చేయాలని చూస్తే ఊరుకునేది లేదు

### బిఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 22:** కులవృత్తులను భూస్థాపితం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్తీ పేరిట పూర్తిగా గీత వృత్తిని రూపుమాపేయాలని దురాలోచన చేస్తోందని బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు దుకాణాలను బంద్ చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గౌడ సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. కుల వృత్తుల బాగోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆయన ఆరోపించారు. మొదట ఔటర్ రింగు రోడ్డు లోపల, ఆ తర్వాత ఔటర్ రింగు రోడ్డు బయట కల్లును నిషేధించాలని భావిస్తున్నట్లు అర్థమవుతోందని అన్నారు.

కల్లు కాంపౌండుపై నిషేధం విధిస్తే లక్షలాది మంది రోడ్ల మీద పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్లును బంద్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లిక్కర్ కంపెనీలు, డిస్టిలరీలు అన్నీ ఒకరిద్దరు చేతుల్లోనే నడుస్తున్నాయని ఆయన అన్నారు. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని అన్నారు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ కల్లును అరికట్టడంలో ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

### పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను దూరం చేసేలా ఎన్ఇపి

### ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ(బిజెపి) రూపొందించిన జాతీయ విద్యావిధానాని(ఎన్ఈపి)కి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాల్సి అవసరం ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మాజీ జాతీయ అధ్యక్షులు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్ అన్నారు. కొత్తగా రూపొందించిన ఎన్ఈపీ ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కానున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర కమిటీ నిర్వహించిన డైలాగ్ విత్ అరుణ్ కుమార్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం మమత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, బి శంకర్, అశోక్ రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లెనిన్, జె.రమేష్, అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో జాతీయ విద్యావిధానం 2020కు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి, పోరాడాలని పిలువునిచ్చారు. జాతీయ విద్యావిధానం పేరుతో దేశంలో విద్య కార్పోరేటీకరణ, కాషాయికరణ, వ్యాపారీకరణ కోసం బిజెపి పూనుకుందని.. పేద విద్యార్థులకు విద్యను మరింత దూరం చేసే కుట్రలో భాగంగానే ఎన్ఈపి-2020ని తీసుకొచ్చిందని విమర్శించారు. దేశంలో జాతీయ విద్యావిధానం పేరుతో ప్రజాస్వామిక హక్కులపై బిజెపి దాడి చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను విద్యలో అమలుచేసే చర్యలకు బిజెపి పాల్పడుతుందని అరుణ్ కుమార్ మండిపడ్డారు. విద్యా రుణాలు ఇచ్చిమరీ విదేశాలకు విద్యార్థులను వెళ్ళేలా ప్రొత్సహిస్తూ దేశ విద్యారంగాన్ని కార్పోరేట్, విదేశీ శక్తుల చేతుల్లోకి నెడుతుందన్నారు. విద్యార్థులు నిరంతరం వారి చదువులతో పాటు రాజకీయాలను కూడా అధ్యయనం చేయాలని.. అప్పుడే వ్యవస్థలో ఉన్న అసమానతలుకై పోరాడే తత్వాన్ని అలవర్చుకుంటారని చెప్పారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలను పరిష్కారించే దిశగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని పోరాటాలకి రావాలని అరుణ్ పిలుపునిచ్చారు.

## ఖర్గేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్

### గాంధీభవన్‌లో బర్త్‌డే కేక్ కట్ చేసిన మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ సోమవారం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీకి వెళ్లి నేరుగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలి పారు. అయితే ఈ పర్యటన రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తిగా మారింది. ఖర్గే జన్మ దిన శుభాకాంక్షలు తెలిపేందుకే టిపిసిసి వెళ్ళినప్పటికి రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా మహేశ్ కుమార్ ఢిల్లీకి రప్పించు కొన్నారని పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల రాబోయే పదేళ్ళు నేనే సిఎంగా ఉంటానని అనడం పార్టీలోని కాంగ్రెస్ నాయకులను ఇబ్బంది పెడుతోన్నది. అదే జిల్లా నుంచి చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ ఒక ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రోజు రోజుకు పెరిగిపోతున్న క్రమశిక్షణా రాహిత్యం, స్థానిక సంస్థల వంటి అంశాలపై ఎఐసిసి పెద్దలతో మహేష్‌కుమార్‌గౌడ్ చర్చించినట్లు తెలుస్తోంది. తెలం గాణలో త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం, నామినేటెడ్ పదవుల భర్తీ అంశంపై కసరత్తు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో టిపిసిసి అధ్యక్షుడి ఢిల్లీ పర్యటన ఆసక్తిగా మారింది. ఆర్డినెన్సు రూపంలో బిసి రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఆర్డినెన్స్ ను గవర్నర్ వద్దకు పంపగా దానిని గవర్నర్ న్యాయసలహా కోసం పంపించారు. గవర్నర్ వద్ద ఏదైనా ఆటంకం ఏర్పడితే రాజకీయంగా బిసి 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధం అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రె డ్డి గతంలోనే చెప్పారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల నాటికి నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన శుభా కాంక్షలు తెలిపేందుకు ఢిల్లీ వెళ్ళిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ కుమారులకు ఢిల్లీ ఎయిర్ పోర్టుల తెలంగాణ పిసిసిఆన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ విభాగం చైర్మన్ కౌశల్ సమీర్, టిపిసిసి ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పృథ్వీరాజ్ నాయక్‌లు ఘనస్వాగతం పలికారు.

మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు ఆధ్వర్యం లో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. హన్మంతరావు బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి ఆయన నిండునూరేళ్ళు ప్రజాసేవలో ఉండాలని శుభాకాంక్షలు తెలుపుతూ ఆశాభావం వ్యక్తంచేశారు. ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ ఖర్గేను కలిసి శుభకాంక్షలు తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి కెసివేణుగోపాల్, తెలంగాణ మంత్రులు వివేక్‌వెంకటస్వామి, ఎంపిలు కలిసి మల్లికార్జునఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు.



## బిజెపికి చిత్తశుద్ధి ఉంటే 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలి

### బిసిలపై మోడీ వివక్ష తగదు: మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇద్దరు బిసిలు కొట్టుకుంటే, అగ్రవర్ణకులాలవారికి కట్టబెట్టారని నిజమైన బిసి పక్షపాతి ఎవరో ప్రజలకు ఇప్పుడు తెలుస్తుందని మాజీ పిసిసి అధ్యక్షుడు మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్ష పదవినే ఇవ్వకుండా బిసిలపై అంత వివక్ష చూపి స్తున్న ప్రధాని మోడీ బిసి బిల్లును ఆమోదిస్తారా? అని అనుమానం వ్యక్తం చేశారు. షెడ్యూల్ 9 చట్టసవరణ చేసి 50శాతం రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ బిజెపి ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్ ఆమోదించాలి.వెనుకబడిన వర్గాలకు చెందిన మోదీ ప్రధానిగా ఉండి బిసి బిల్లుకు ఆమోదిస్తారా లేదా.?బిసి రిజర్వేషన్ లో బిజెపి ఎంపీల సంగతి, ప్రధాని మోదీ సంగతి ఏంటి అని ఈ పార్లమెంట్ సమావేశాల్లో చూస్తాం. బిసి పక్షపాతులు ఎవరు, వ్యతిరేకులు ఎవరు అనేది తేలిపోతుందని ఆయన అన్నారు. బిసి లు ఐక్యంగా ఉండాలి. కాంగ్రెస్ అధిష్ఠానం రిజర్వేషన్ పెంపుకు పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కులగణన జరుగదని కొందరు భావించారు కానీ శాస్త్రీయంగా నిర్వహించామని ఆయన తెలిపారు.

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వాహనంపై దాడి కేసులో నలుగురు అరెస్టు

**హైదరాబాద్ (తార్నాక, కంటోన్మెంట్) జులై 22(జర్నలిస్ట్‌ఫైల్):** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వాహనంపై ఆదివారం రాత్రి జరిగిన దాడి ఘటనలో పోలీసులు సోమవారం సాయంత్రం నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించడంతోనే తాము ఎమ్మెల్యే వాహనం ఆపి అడిగినట్లు అరెస్టు అయిన వారు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌తోపాటు మరో మూడు వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించారని ఈ విషయంపై తాము ఎమ్మెల్యే వాహనానికి అడ్డుగా వెళ్లి ఏమిటి ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తారా అని ప్రశ్నించామని చెప్పడం జరిగిందని అరెస్టు అయిన వారు చెప్పారు. తుకారాంగేట్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో శ్రీగణేష్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు తనపై ఉద్దేశ పూర్వకంగానే దాడి జరిపారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

## శ్రీ వాసవి మాతకు శాకంబరీ అలంకారం సందర్భముగా అన్న సమారాధన



పెడన, జూలై 22(జర్నలిస్ట్‌ఫైల్):

కృష్ణాజిల్లా పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న పర్యవేక్షణలో పట్టణ ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో శ్రీ వాసవి మాతకు అన్ని రకముల కూరగాయలతో అలంకరించిన శాఖాంబరి అలంకారం ముగింపు సందర్భముగా శ్రీ వాసవి ప్రార్థన మందిరం (కళ్యాణమండపం) నందు నిర్వహించిన అన్న సమారాధనకు పెడన పట్టణ మండల పరిసర ప్రాంతా ఆర్యవైశ్య సోదర సోదరీమ ణులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వాసవి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. జై వాసవి జై జై వాసవి అను నామస్మరణతో శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రాంగణం మారు మోగింది. ఈ సందర్భంగా పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులచే సౌందర్యలహరి పారాయణా 108 శ్లోకాలను గులాబీ పూలతో పూజా కార్యక్రమాలను శ్రీ వాసవి క్షేత్రం అర్చకులు కోట సతీష్ శర్మ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్యవజన సంఘం ఉపాధ్యక్షులు చిలకల బాలాజీ కార్యదర్శి సమయ మంత్రి కుమార్ కార్యవర్గ సభ్యులు కొల్లిపర పవన్ తాడేపల్లి రామకృష్ణ సభ్యులు ఇమ్మడి మంగమోహన్ ఉదయగిరి గోపాల్ పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ కార్యవర్గ సభ్యులు జల్లూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.



## ద్వారావతి దాతృత్వం ఆదర్శనీయం

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, జూలై 22(జర్నలిస్ట్‌ఫైల్):

ఆకలి కడుపులను నింపి.. మానవ సేవయే మాధవ సేవగా తలచి దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ద్వారావతి ఫౌండేషన్ అందరికీ ఆదర్శనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నిత్యం ఎంతోమంది ఆకలిని తీర్చుతున్న ద్వారావతి నిత్యాన్నప్రసాద సేవ ద్వారా గత నాలుగేళ్లుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాలను వచ్చే వారికి భోజనం అందిస్తున్నారు. సోమవారం ఈ సేవా కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు సమర్పించేందుకు చాలా దూరప్రాంతాల నుంచి సైతం ప్రజలు వస్తుంటారని.. అలాంటివారు దాదాపు 200 మంది ఆకలిని తీర్చుతున్నద్వారావతి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అన్నార్తులకు చేయూతనివ్వడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఫౌండేషన్ వైద్య సేవలను కూడా అందిస్తోందన్నారు. ప్రతి ఆదివారం విజయవాడ, నూజివీడులో ఉచిత ఆదివారం హాస్పిటల్స్ ద్వారా, ప్రతి నెలా మెగా క్యాంపులను నిర్వహిస్తూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి చాలా ఉన్నతమైనదని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ జి.సంతోష్ కుమార్, వైస్ ఛైర్మన్ పి.సత్య, ట్రస్టీ బోర్డు సభ్యులు ఎస్.విజయ్, కుమార్, సుధాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు



ఆగిరిపల్లి, జూలై 22(జర్నలిస్ట్‌ఫైల్):

తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో "సుపరిపాలనలో తొలి అడుగు " కార్యక్రమం పిన్నమరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ శివారు గ్రామం అయిన రాజవరం, గ్రామంలో తెలుగుదేశం పార్టీ, గ్రామ పార్టీ ఆధ్వర్యంలో " సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమన్ని నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కుంపటి కోటేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు జన్ని రాంబాబు,మండల సీనియర్ నాయకుడు రొంపిచర్ల గిరిధర్, గ్రామ ప్రధాన కార్యదర్శి గోళ్ళ చిన్న బాలయ్య, గ్రామ ఉపాధ్యక్షుడు గోళ్ళ చంటి, మండల తెలుగు యువత నాయకులు యలమర్తి భవానీ శంకర్,రొంపిచర్ల విల్సన్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి యలమర్తి సువర్ణ బాబు,రొంపిచర్ల రాజు, రొంపిచర్ల ప్రభు దాస్, జంగ ప్రభుదాసు ,కొవ్వలి బాల ఏసు అలియాస్ కిషోర్,కొవ్వలి చిన్న బాబు ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిఆర్సి కమిటీని వెంటనే నియమించండి





- పెండింగ్ డిఏలు మంజూరు చేయాలి
- ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి
- చీఫ్ సెక్రటరీను కలిసిన ఏపీ జేఏసీ నాయకులు

అమరావతి , జూలై 22(జర్నలిస్ట్‌ఫైల్):

వెలగపూడి సచివాలయంలో నూతన ఎన్జీజివో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మరియు ఎపి జేఏసి చైర్మన్ ఎ . విద్యాసాగర్ సెక్రెటరీ జనరల్ కే ఎస్ ఎస్ ప్రసాద్ (ఏపీయుటీ ఎఫ్) ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల నేతలు సోమవారం వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగులకు సంబంధించిన పి ఆర్ సి కమిటీని వెంటనే నియమించాలని, రెండు సంవత్సరాలకు పైగా కాలాతీతం అయినందున వేతన సవరణ కమిషను వెంటనే నియమించి వేతన సవరణ ప్రక్రియని ప్రారంభించాలని కోరారు.

ఉద్యోగులకు సంబంధించి మూడు డిఏలు పెండింగ్ ఉన్నాయని కనీసం రెండు డి ఎ లు అయినా మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయి లు తదితర వాటి మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులపై 2019 24 సంవత్సరాల మధ్య వివిధ ఆందోళనలో నమోదైన పెండింగ్ కేసులన్నీ ఎత్తివేయాలని, ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లించాలని,ఉద్యోగుల సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగు చీఫ్ సెక్రటరీ చైర్మన్గా త్వరలోనే ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించిన ప్రక్రియ కూడా ప్రారంభమైంది అన్న విషయాన్ని జేఏసీ సంఘాల నేతలు చీఫ్ సెక్రెటరీకి తెలియజేశారు. పబ్లిక్ సెక్టార్ గురుకుల ఉద్యోగులకు 60 నుంచి 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సు పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పెన్షనర్లకు సంబంధించిన అడిషనల్ కౌంటం పునరుద్ధరణ, 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓపిఎస్ వర్తింపు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పిఆర్సి కమిటీ ఏర్పాటు, డి ఎ మరియు బకాయిలు చెల్లింపు అంశాలలో ఉద్యోగుల్లో ఉన్న ఆందోళన చీఫ్ సెక్రటరీగా దృష్టికి విద్యాసాగర్ తీసుకుని వచ్చారు.

### ఉద్యోగుల హెల్త్ కార్డుల విషయంలో ఈహెచ్ఎస్

మేనేజ్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారని, సెక్రటరీ అధ్యక్షతన జరగవలసిన ఈహెచ్ఎస్ స్టీరింగ్ కమిటీ మీటింగ్ ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు సమర్థ నిర్వహణకు గాను తీసుకోవలసిన కొన్ని నిర్ణయాలను ఈహెచ్ ఎస్ స్టీరింగ్ కమిటీలో తీసుకొనవలసిన అవసరం ఉన్నదన్న విషయాన్ని జేఏసీ నేతలు చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకుని వచ్చారు. జేఏసీ నాయకులతో చీఫ్ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి ముందు కార్యాచరణ జరుగుతుందని, డిపార్టెంట్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేశామని, ఉద్యోగులకు ఒకరోజు గ్రీవెన్స్ డే ని అమలుపరచమని ఉత్తర్వులు ఇచ్చామని, నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత 7500 కోట్ల రూపాయల్ని బకాయిల కింద చెల్లించామని, మిగిలిన అన్ని విషయాలను ముఖ్యమంత్రిగా దృష్టికి తీసుకుని వెళ్లి దశలవారీగా పరిష్కరిస్తామని, ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో బాధ్యతగా ఉంటుందని తెలిపారు. నూతనముగా ఏపీ ఎన్జీజివో సంఘ అధ్యక్షుడిగా మరియు ఏపీ జెఎసి చైర్మన్గా ఎన్నికైన ఏ. విద్యాసాగర్ ను, రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డివి రమణను అభినందించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో.. చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ ని కలిసిన వారిలో రాష్ట్ర జె ఏ సి చైర్మన్ అలపర్తి విద్యా సాగర్ సెక్రెటరీ జనరల్ కె ఎస్ ప్రసాద్, ఏపి యు టీ ఎఫ్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి వి రమణ..కో, చైర్మన్. జి హృదయ రాజు, ఏపి టి ఎఫ్ చెన్నుపాటి మంజుల, ఎన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ఇరిగేషన్ సి పి ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సి ఎం దాస్, అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ ఆర్ ఎస్.హరనాథ్, గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు జానీ పాషా, పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్చంద్రశేఖర్ ఆర్ టీ సి ఎన్ ఎం యు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, పశ్చిమగోదావరి జిల్లా జె ఏ సి కన్వీనర్ నెరుసు రామారావు, రాష్ట్ర ఎన్జీజివో అసోసియేషన్ ప్రచార కార్యదర్శి జానకి, విజయనగరం జిల్లా సహాధ్యక్షుడు కిషోర్, ఏ ఐ ఎస్ జి ఈ ఎఫ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు సిహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక





కాకినాడ, జూలై 22(జర్నలిస్ట్‌ఫైల్):

కాకినాడ జిల్లాలోని కాకినాడ పట్టణమునందు గల ఆదిత్య మహిళల కళాశాల సెమినార్ హాలులో ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఘనంగా జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ కి మెంటర్ గా వ్యవహరిస్తున్న నాగం సతీష్ బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ సంఘ అధ్యక్షురాలుగా డాక్టర్ నల్లమిల్లి సుగుణ (తూర్పుగోదావరి), ప్రధాన కార్యదర్శి గా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమగోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్ర కళావతి (కడప), ఉపాధ్యక్షురాలుగా కె.సూర్యలక్ష్మి దేవి (గుంటూరు), సహాయ కార్యదర్శి గా జి. నవీన్ (ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా నంద్యాల రాధిక (కర్నూల్), డి.అశోక్ బాబు (గుంటూరు) లు ఎన్నిక అయినారు. ఈ ఎన్నికలకు ఫెన్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి నుండి పరిశీలకులుగా అశోక్ దుదారె, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వారి నుండి వి.సతీష్ (సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్) డి ఎస్ ఏ కాకినాడ వారు లు పరిశీలకులుగా విచ్చేశారు నూతన కార్యవర్గ సభ్యులు 2025 నుండి 2029 వరకు కొనసాగుతారు అని ఫెన్సింగ్ అసోసియేషన్ మెంటార్ నాగం సతీష్ బాబు తెలియచేశారు.

## ఆర్జీదారుల సంతృప్తే

# లక్ష్యంగా అర్జీలను పరిష్కరించండి

- నిర్ధేశించిన సమయంలో అర్జీలను పరిష్కరించాల్సిందే
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, జూలై 22(జర్నలిస్ట్‌ఫైల్):

ఆర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా అర్జీలకు పరిష్కరించూపాలని, నిర్ధేశించిన సమయంలో అర్జీలను పరిష్కరించాల్సిందేనని ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ఉపేక్షించబోనని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జీదారుల సంతృప్తి చేందాలనే లక్ష్యంతో అధికారులు సమస్యలను నిర్ధేశించిన సమయంలో పరిష్కరించాలని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించిన ఉపేక్షించే ప్రశక్తే లేదని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కాం మవుతుందనే ఆశతో గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయిస్తారన్నారు. వారి నమ్మకానికి బలం చేకూర్చే విధంగా నాణ్యతా ప్రమాణాలతో ఆర్జీలను పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. అర్జీలు ఎట్టిపరిస్థితులతో పెండిరగ్ ఉండరాదన్నారు. వ్యక్తిగత సమస్యలు ఎదురైనప్పుడు పడే ఇబ్బందులు పరిష్కరించుకోవాలనే తపన అధికారులకు ఎలా ఉంటుందో ప్రజలకు కూడా ఆదే విధమైన భావన ఉంటుందనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకుని సేవ చేస్తున్నాననే మానవ తాదృక్పథంతో సమస్యల పరిష్కారం పై దృష్టిపెట్టాలన్నారు. నమోద్కెన ఆర్జీలకు సంబంధించి కిందిసాయి అధికారుల నుండి తగిన సమాచారాన్ని సేకరించి అర్జిదారులను సంతృప్తి పరచడమే ధ్యేయంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చాలన్నారు. ఆర్జీల పరిష్కారంపై తాను ప్రతి రోజు సమీక్షాన్నానని ఆర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

### 169 అర్జీల స్వీకరణ

రెవెన్యూ శాఖకు సంబంధించి 46, పోలీస్ శాఖకు 26, విద్య 23, ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ 12, పంచాయతీరాజ్ 9, ఏపిసిపిడిసిఎల్ 8, పౌరసరఫరాలు 5, విభిన్న ప్రతిభావంతులు 5, డిఆర్‌డిఏ 5, ఎండోమెంట్స్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 3, ఆర్ఐవో 3, ఆర్‌డబ్ల్యుఎస్ 3, హెల్త్ 2, సోషల్ వెల్ఫేర్ 2, సర్వే 2, వ్యవసాయం, పశుసంవర్ధక, కో – ఆపరేటివ్,

అటవీ, జిఎస్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, ఐసిడిఎస్, లీడ్ బ్యాంకు మేనేజర్, న్కెపుణ్యాభివృద్ధి, నీటివనరులు కు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 169 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్వో ఎం లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వి నాంచా రరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి, వివిధశాఖలజిల్లాస్థాయిఅధికారులు పాల్గొన్నారు.

# పహాల్గాంపై చర్చ జరపవలసిందే

## లోక్‌సభ, రాజ్యసభలో పట్టుపట్టిన విపక్షాలు
## చర్చకు సిద్ధమేనన్న ఎన్డీయే పక్షం
## తొలిరోజే ఉభయసభల్లో వాడివేడి చర్చలు






**న్యూఢిల్లీ,జూలై 22:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే పహాల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్ సభ, రాజ్యసభలో విపక్షాలు పట్టుపట్టాయి. భారత్ పాక్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 24 సార్లు చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డాయి. దీనిపై పార్లమెంటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ చీఫ్, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. పహాల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై చర్చ కోసం రూల్ 267 కింద వారు రాజ్యసభలో వాయిదా నోటీసులను అందించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలపై చర్చలో పాల్గొనేందుకు నిరాకరించారు. పహాల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై రెండు రోజుల పాటు ఉభయ సభల్లో చర్చించాలని జీరో అవర్‌లో ఖర్గే డిమాండ్ చేశారు. దీనిపై విపక్ష ఎంపీలంతా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. 12 గంటలకు రాజ్యసభలో క్వశ్చన్ అవర్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈక్రమంలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. పహాల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను నేటికీ గుర్తించలేదన్నారు. ఉగ్రదాడి జరిగిన రోజు ఏప్రిల్ 22న పహాల్గాంలో భద్రతా లోపాలు ఉన్నాయని స్వయంగా జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఆ ఉగ్రదాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కొన్ని వివరాలను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్), డిప్యూటీ ఆర్మీ చీఫ్, మరో సీనియర్ ఆర్మీ ఉన్నతాధికారి వెల్లడించారని ఖర్గే చెప్పారు.

మరోవైపు విపక్షాల డిమాండ్‌పై రాజ్యసభలో కేంద్ర మంత్రి జెపి నడ్డా స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర చర్చకు నరేంద్ర మోడీ సారథ్యంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అలాంటి సైనిక ఆపరేషన్ ఎన్నడూ జరగలేదన్నారు. పహాల్గాం ఉగ్రదాడపైనా చర్చిస్తామని తెలిపారు. ఇంతకుముందు పార్లమెంటు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలోనూ ఈ వివరాలను విపక్షాలకు తాము తెలిపామని నడ్డా చెప్పారు. ఆపరేషన్ సిందూర్, పహాల్గాం ఉగ్రదాడిపై సభ్యులు కోరుకున్నన్ని రోజులు పూర్తిస్థాయి చర్చ జరుగుతుందని విపక్ష ఎంపీలకు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ కూడా హామీ ఇచ్చారు. దీనిపై తాను అన్ని పార్టీల నేతలతో మాట్లాడతానన్నారు. అయితే ఆలస్యం చేయకుండా ఆపరేషన్ సిందూర్‌పై వెంటనే చర్చను మొదలుపెట్టాలని ఖర్గే కోరారు. దీనిపై నడ్డా స్పందిస్తూ, తాము చర్చ నుంచి తప్పించుకునే యత్నం చేయడం లేదన్నారు. ఈక్రమంలో రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ కలుగజేసుకుంటూ, అన్ని పార్టీల ఎంపీలు పరస్పర గౌరవ భావంతో మెలగాలని కోరారు. పరుష పదజాలాన్ని, వ్యక్తిగత దూషణలను ఏ వేదికపైనా చేయొద్దన్నారు.

ఘర్షణలు, విమర్శలు అనేవి అర్థవంతమైన రాజకీయాలు కానే కావని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో ఏఒక్కరు కూడా భారత ప్రయోజనాలను వ్యతిరేకించరని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత నాగరికతలోని విలువలకు వ్యతిరేకంగా ఉండే నడవడిని వీడాలన్నారు. పార్లమెంటు సమావేశాలు అర్థవంతంగా జరగాలంటే, చర్చలు, సంప్రదింపులు మాత్రమే మార్గాలని జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. భారతదేశ చారిత్రక బలం కూడా చర్చలు, సంప్రదింపులు, సంభాషణలపైనే ఆధారపడి ఉందన్నారు. ఆ బాటలోనే పార్లమెంటు చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలకు ఆయన పిలుపునిచ్చారు. అంతర్గత కుమ్ములాటల వల్ల మన శత్రువులకు బలం వస్తుందని, మనల్ని విభజించే సామర్థ్యం వాళ్లకు లభిస్తుందన్నారు. తన నివాసంలో నోట్ల కట్టలు లభ్యమైన వ్యవహారంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై 200 మందికిపైగా ఎంపీలు పార్లమెంటులో సోమవారం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 145 మంది ఎంపీలు, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసులు అందించారు. లోక్‌సభలో ఈ నోటీసులు అందించిన ఎంపీల్లో అనురాగ్ ఠాకూర్, రవిశంకర్ ప్రసాద్, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, రాజీవ్ ప్రతాప్ రూడీ, పిపి చౌదరి, సుప్రియా సూలే, కెసి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217, 218 కింద ఈ నోటీసులు అందించారు. జడ్జి తొలగింపునకు సంబంధించిన తీర్మానంపై కనీసం 100 మంది లోక్‌సభ ఎంపిలు, 50 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. 145 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేసినందుకు ఈ తీర్మానం తదుపరి దశకు చేరడం దాదాపు ఖాయమైంది. దీనిపై రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ తుది నిర్ణయాన్ని తీసుకోనున్నారు. నివాసంలో నోట్ల కట్టలు లభ్యమైన వ్యవహారంతో తనకు సంబంధం లేదని జస్టిస్ యశ్వంత్ వర్మ అంటున్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ విచారణ జరిపి, నోట్ల కట్టలు లభ్యమైన స్టోర్ రూంపై జడ్జి, ఆయన కుటుంబానికే పూర్తి పట్టు ఉందని తేల్చింది.



# గాజాలో అన్నార్తులపై ఆగని దాడులు
## తాజా కాల్పుల్లో 90 మంది మృత్యువాత

**డెయిర్ అల్‌బలా, జూలై 22:** హమాస్ ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన యుద్ధం కారణంగా గాజా మరుభూమిగా మారిపోయింది. ఎక్కడచూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడా గాజా పౌరులు దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. తిండి, నీరులేక ఆకలితో అలమటిస్తున్నారు. ఇటు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు, అటు హమాస్ ఉగ్రవాదుల ఎదురుకాల్పుల మధ్య వారు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో గాజా పౌరుల ఆకలి తీర్చేందుకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు గాజాలో మానవతా సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశాయి. ఈ కేంద్రాలవద్ద ఇజ్రాయెల్‌సైన్యం కాపలా కాస్తోంది. ఆకలి తట్టుకోలేక జనం ఈ కేంద్రాల వద్ద పోటెత్తుతున్నారు. వారిని నియంత్రించేందుకు సైనికులు కాల్పులు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నార్త్ గాజాలోని ఓ ఆహార పంపిణీ కేంద్రం వద్ద గుమిగూడిన జనాలను నియంత్రించేందుకు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరిపిందని, ఈ ఘటనలో ఏకంగా 80 మంది మరణించారని గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ ఆరోపించింది. మరో రెండు కేంద్రాల వద్ద 10 మందికిపైగా గాజా పౌరులు మృత్యువాత పడ్డారని తెలిపింది. ఆకలి తట్టుకోలేక సాయం కోసం వచ్చిన అమాయకులపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) తూటాల వర్షం కురిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది.

కాగా, గాజాలో పౌరుల దీనస్థితికి అద్దంపట్టే సంఘటన గురించి ఐక్యరాజ్య సమితి అధికారులు వివరిస్తూ.. ఇటీవల గాజా సిటీలోకి ఐక్యరాజ్య సమతి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ కింద 25 ట్రక్కులనిండా ఆహార పదార్థాలు, నిత్యా వసర వస్తువులను పంపించిందనిచెప్పారు. సరిహద్దుల్లో తనిఖీల తర్వాత ట్రక్కులు ఇలా గాజా సిటీలోకి ప్రవేశించాయో లేదో వందలాది మంది పౌరులు వాటిని చుట్టుముట్టారని తెలిపారు.

# అక్రమ వలసదారులను బయటకు విసిరేయాల్సిందే!
## సిబిపి అధికారిపై కాల్పులతో ట్రంప్ ఆగ్రహం

**వాషింగ్టన్,జూలై 22:** యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) అధికారిపై అక్రమ వలసదారుడు కాల్పులు జరిపిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. అక్రమ వలసదారులను సరిహద్దు బయటకు విసిరేస్తామని చెప్పారు. దాడిచేసిన వ్యక్తిని 2023 ఏప్రిల్‌లో పట్టుకున్నప్పటికీ బహిష్కరించకుండా విడుదల చేశారని విమర్శించారు. కాల్పుల ఘటనపై ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ జో బైడెన్ పాలనలో విడుదలైన ఒక అక్రమ వలసదారుడు నిన్న రాత్రి న్యూయార్క్‌లో సిబిపి అధికారిపై కాల్పులు జరిపాడు. అతడిని 2023 ఏప్రిల్‌లో సరిహద్దు వద్ద పట్టుకున్నారు. కానీ బహిష్కరించకుండా విడుదల చేశారు. కాల్పుల్లో సిబిపి అధికారి గాయపడినప్పటికీ దాడి చేసిన వ్యక్తితో ధైర్యంగా పోరాడి ధైర్యాన్ని ప్రదర్శించాడు. డెమోక్రాట్లు మన దేశాన్ని నేరస్థుల ఆక్రమణలతో నింపారు. ఇప్పుడు వారందరినీ బయటకు విసిరివేయాలి, లేదా కేసులు నమోదు చేయాలి, ఎందుకంటే వారు మళ్లీ తిరిగి వచ్చే అవకాశం ఇవ్వకూడదు. వారు చాలా ప్రమాదకరమైన వారని ట్రంప్ ఆ పోస్టులో పేర్కొన్నారు.

న్యూయార్క్ పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ కథనం ప్రకారం.. ఈ ఘటన రాత్రి 11:50 గంటల సమయంలో ఫోర్ట్ వాషింగ్టన్ పార్క్‌లో జరిగింది. 42 ఏళ్ల ఫెడరల్ ఏజెంట్ ఒక మహిళతో కలిసి హడ్సన్ నది ఒడ్డున ఒక రాతిపై కూర్చొని ఉండగా ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై వచ్చారు. ఒక వ్యక్తి దిగి అధి కారి వద్దకు వచ్చాడు. అతడు దోపిడీకి గురవుతున్నట్టు గ్రహించి వెంటనే తన సర్వీస్ వెపన్‌ను బయటకు తీశాడు. ఇద్దరూ కాల్పులు జరిపారు. అధికారి ముఖం, ఎడమ చేతికి గాయాలయ్యాయి. దాడిచేసిన వ్యక్తి కూడా గాయపడ్డాడు. తర్వాత నిందితులిద్దరూ పారిపోయారు. పారిపోయిన వారిలో ఒకరిని 21 ఏళ్ల అక్రమ వలసదారుడు మిగ్యూల్ మోరాగా గుర్తించారు.



## టేకాఫ్‌కు రెడీ అయిన బ్రిటిష్ రాయల్ నేవీ జెట్!

**తిరువనంతపురం,జూలై 22:** కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 14 నుంచి చిక్కుకుపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్35బి స్టెల్త్ యుద్ధ విమానం హైడ్రాలిక్ సిస్టమ్ లోపాన్ని ఎట్టకేలకు సరిచేశారు. ఈ విమానం యూకేకు బయలుదేరడానికి ముందు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రాయల్ నేవీకి చెందిన విమాన వాహక నౌక హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ నుంచి విమానాన్ని డైవర్ట్ చేసి ఈ నెల 14న కేరళలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం ఖరీదు దాదాపు 115 మిలియన్ డాలర్లు. హైడ్రాలిక్ వైఫల్యం కారణంగా గత నెల రోజులుగా ఇది తిరువనంతపురంలోనే హ్యాంగర్‌కు ఉండిపోయింది. ఈ నెల 6న బ్రిటిష్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ400ఎం అట్లాస్‌లో వచ్చిన 25 మంది బ్రిటిష్ ఇంజనీర్ల బృందం ఎయిర్ ఇండియా మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) హ్యాంగర్‌లో ఈ విమానానికి మరమ్మతులు ప్రారంభించింది. ఈ ఉదయం ఎఫ్35బి విమానాన్ని హ్యాంగర్ నుంచి బయటకు తీసుకొచ్చారు, మరమ్మతులు విజయవంతం కావడంతో యూకేకు తిరిగి వెళ్లేముందు నేడు కానీ, రేపు కానీ ట్రయల్ ఫ్లైట్ నిర్వహించేందుకుసన్నాహాలు జరుగుతున్నాయి.

## ముంబయి రైళ్లలో పేలుడు కేసులో సంచలన తీర్పు
### ప్రాసిక్యూషన్ విఫలం అయిందని బాంబే హైకోర్టు వెల్లడి

**ముంబయి,జూలై 22:** రెండుదశాబ్దాలనాటి ముంబయి రైళ్లలో పేలుళ్ల కేసులో 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2006లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి దోషులని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని జస్టిస్ అనిల్ కిలోర్ జస్టిస్ శ్యామ్ చందక్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టమని వివరించింది. అందువల్ల దిగువ కోర్టు విధించిన శిక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన బాంబే హైకోర్టు, వారిని నిర్దోషులుగా విడుదల చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతర్వాత వివిధజైళ్లనుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుముందుహాజరైన దోషులు తమ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు 12 మందిని దోషులుగా నిర్ధారించింది.

వారిలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణ శిక్ష విధించింది. మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ తీర్పు అప్పట్లో వెలువరించింది. అందులో దోషుల్లో ఒకడైన కమల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పూర్ జైల్లో మృతి చెందాడు. అయితే ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు హైకోర్టును ఆశ్రయించారు. వాటిని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

# కేవలం రూ. 100కే ఇల్లు..! ఎక్కడో తెలుసా?



**ప్యారిస్, జూలై 22:** ఎప్పటికైనా సొంతిల్లు కొనుగోలు చేయాలనే ఆశ అందరికీ ఉంటుంది. తాము కలలు కనే నివాసం తక్కువ ధరకే.. విదేశాల్లో సొంతమయితే! ఇంకేముంది ఎగిరి గంతేస్తారు. ఇలా సొంతింటి కోసం కలలు కంటున్న ప్రజల కోసం ఫ్రాన్స్ ఓ సూపర్ ఆఫర్‌ను మన ముందుకు తీసుకువచ్చింది. ఆ దేశంలోని అంబర్ట్ అనే పట్టణంలో కేవలం ఒక్క యూరో (రూ. 100) చెల్లించి.. ఇల్లు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించింది. ఫ్రాన్స్‌లో పుయ్-డి-డోమ్ ప్రాంతంలో ఉన్న ప్రశాంతమైన పట్టణం అంబర్ట్‌లో రోజురోజుకు తగ్గిపోతున్న జనాభాను పునరుద్ధరించేందుకు ఈ వినూత్న ప్రయత్నం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మెరుగైన మౌలిక సదుపాయాల కోసం ప్రజలు నగరాల వైపు తరలివెళ్లడంతో 19వ శతాబ్దం నుంచి ఈ ప్రాంతంలో జనాభా తగ్గుతూ వస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ పట్టణంలో 6,500 మంది నివసిస్తున్నారు. జనాభాను మరింత పెంచడానికి అక్కడి అధికారులు ఐదేళ్ల ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగానే ప్రజలకు రూ. 100కే ఇల్లు కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. జనాభాను పునరుద్ధరించడం, స్థానిక పాఠశాలలు, వ్యాపారాలు వంటి వాటిని అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలతో ఈ ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇళ్లకొనుగోలుకు కేవలం వందరూపాయలు మాత్రమే అవుతున్నప్ప టికీ.. శతాబ్దాలనాటి అక్కడి భవనాలను పునరుద్ధరించడానికి దాదాపు రూ. 20నుంచి రూ. 50 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంటిని కొనుగోలుచేసే సమయంలోనే కొనుగోలు దారులు ఆ ఇంటి పునరుద్ధరణకు కట్టుబడి ఉంటామని తెలియ జేస్తూ.. హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఫ్రాన్స్ ప్రజలతోపాటు, విదేశీయులు కూడా అంబర్ట్‌లో ఇళ్లను కొనుగోలు చేయవచ్చు. భవనాల పునరుద్ధరణకు డబ్బు కావాలనుకుంటే అక్కడి ప్రభుత్వం తక్కువ వడ్డీకి రుణాలు, పునరు ద్ధరణ గ్రాంట్లు వంటి రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. అయితే ఇంటిని కొన్నాక కనీసం మూడేళ్లపాటు అక్కడే నివసించాల్సి ఉంటుంది. ఫ్రెంచ్‌భాష తెలిసిఉండడం తప్పనిసరి కానప్పటికీ అక్కడిస్థానికులు, వ్యాపారు లతో కమ్యూనికేట్ చేయగలిగితే బాగుంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# అమెరికాలో గ్రీన్‌కార్డుకు రెడ్ సిగ్నల్..





**వాషింగ్టన్, జూలై 22:** అమెరికాలో ట్రంప్ సర్కారు వచ్చిన తర్వాత గ్రీన్‌కార్డులు, వీసాల జారీ, వలసపోవడం కష్టతరంగా మారాయి. అయితే.. వీటిల్లో వీసాలు, గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల ఇప్పుడు ఆ దేశ కార్పొరేట్ రంగంపై దుష్ప్రభావం చూపడం మొదలుపెట్టింది. వివిధ రంగాల్లోని కార్పొరేట్ లీడర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల వర్క్ పర్మిట్లు ముగియడం.. వాటి పునరుద్ధరణ వెంటనే జరగకపోవడంతో వారు పదవుల నుంచి వైదొలగాల్సి వస్తోంది. ముఖ్యంగా శాశ్వత నివాసం కల్పించే గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల .. సక్రమమార్గంలో దేశంలోకి వచ్చి కొన్నేళ్లుగా వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న వారు కూడా వెళ్లిపోయేటట్లు చేస్తోంది. అమెరికాలోనే అతిపెద్దదైన మెట్రోపాలిటన్ ర్యాపిడ్ ట్రాన్సిట్ అథారిటీ (మార్టా) సిఇఒ కొల్లిన్ గ్రీన్‌వుడ్ జూలై 17న పదవి నుంచి వైదొలిగారు. ఆయనకు వర్క్‌పర్మిట్ కాలవ్యవధి ముగిసిపోవడం.. గ్రీన్‌కార్డ్ జారీలో జాప్యంతో ఆయన తన పదవిలో కొనసాగడం అసాధ్యంగా మారింది. దీంతో ముందస్తు రిటైర్‌మెంట్‌ను ఆయన ఎంచుకొన్నారు. ఆయన స్వస్థలం కెనడా. తమ సిఇఒకు గ్రీన్‌కార్డ్ త్వరలోనే వస్తుందని మార్టా చెప్పినా.. పదవిని వీడేందుకే గ్రీన్‌వుడ్ మొగ్గు చూపారు.

**భారతీయులకు గ్రీన్‌కార్డుల్లో భారీ జాప్యం..**

అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్న భారతీయులు.. ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఇమిగ్రేషన్ బ్యాక్‌లాగ్‌లో 1.13 కోట్ల దరఖాస్తులున్నాయి. ఈ స్థాయిలో పెండింగ్‌లో ఉండటం ఓ రికార్డ్. ఇక ఈ యేడాది రెండో త్రైమాసికంలో మరో 16 లక్షల కొత్త దరఖాస్తులు వచ్చి చేరనున్నాయి. ఇటీవల యుఎస్ సిఐఎస్ ప్రచురించిన డేటాషీట్‌లో ఈ వివరాలున్నాయి. ఇక రెండో త్రైమాసికంలో ప్రాసెస్ చేసిన దరఖాస్తుల సంఖ్య కూడా తగ్గింది. గతేడాది 3.3 మిలియన్లు చేయగా.. ఈసారి 2.7 మిలియన్లకే పరిమితమైంది. ఇక గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారులు వాడే ఫారమ్ ఐ-90 సగటు వెయిటింగ్ టైమ్ 0.8 నెలల నుంచి 8 నెలలకు చేరింది. ఫారమ్ ఐ-765ల్లో దాదాపు 2 మిలియన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

# 'ఒబామా అరెస్టు'! ఎఐ వీడియో పోస్టు చేసిన ట్రంప్



**వాషింగ్టన్, జూలై 22:** డెమోక్రాట్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు సంబంధించి ఓ వీడియో పోస్ట్ చేశారు. ఓవల్ ఆఫీసులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) అధికారులు ఒబామాను అరెస్టు చేస్తున్నట్లుగా ఎఐ సాయంతో రూపొందించిన వీడియో అది. 'చట్టానికి ఎవరూ అతీతులు కారు' అనే మెసేజ్ ఇస్తూ మాజీ అధ్యక్షుడిపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఆ వీడియోలో తొలుత ఒబామా మాట్లాడుతూ.. 'చట్టానికి అధ్యక్షుడు అతీతుడే' అని అన్నట్లుగా ఉంది. ఆ వెంటనే పలువురు రాజకీయ నాయకులు 'చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదు' అని మాట్లాడినట్లు ఉంది. చివరకు ఓవల్ ఆఫీసులో ట్రంప్, ఒబామా మాట్లాడుకుంటుండగా ఎఫ్‌బిఐ అధికారులు అక్కడికి వచ్చి మాజీ అధ్యక్షుడి చేతికి సంకెళ్లు వేసినట్లుగా ఈ వీడియోను రూపొందించారు. ఆ సమయంలో ట్రంప్ నవ్వుతూ కన్పించడం గమనార్హం. తర్వాత ఒబామా ఖైదీ దుస్తుల్లో జైల్లో కూర్చుని ఉన్నట్లు చూపించడంతో వీడియో ముగుస్తుంది. ఈ వీడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేయగా..ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్‌గా మారింది. అధ్యక్ష ఎన్నికల్లో ఒబామా భారీఎత్తున మోసాలకు పాల్పడ్డారంటూ ట్రంప్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలి సిందే. దాన్ని ఉద్దేశిస్తూనే అధ్యక్షుడు తాజావిడియో పోస్టు చేసినట్లు తెలు స్తోంది. గత వారం యుఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ సంచలన ఆరోపణలు చేశారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆతర్వాత ఆయనపాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని ఆమెఅన్నారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి తన వద్ద బలమైన సాక్ష్యాలున్నాయని పేర్కొన్నారు. ఒబామా హయాంలో పనిచేసిన వారందరినీ విచారించాలని తులసీ గబ్బార్డ్ పిలుపునిచ్చారు.

# సంక్షిప్తంగా..

## నన్ను మాట్లాడనీయడంలేదు: రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ,జూలై 22:** కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతనైన తనకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. సభలో అధికార పక్ష సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలోని మంత్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి... తనకు మాత్రం తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమేనని రాహుల్ అన్నారు. లోక్ సభలో చర్చ ప్రారంభమైన వెంటనే ప్రధాని మోడీ వెళ్లిపోయారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అన్ని విషయల్లో వారికి అనుకూలమైన కొత్త విధానాలను సృష్టించుకుంటోందని విమర్శించారు.

## అమర్‌నాథ్ యాత్రకు పెరుగుతున్న భక్తులు

**శ్రీనగర్,జూలై 22:** అమర్‌నాథ్ యాత్రకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఈ నెల 3న యాత్ర ప్రారంభం కాగా 18 రోజుల్లో మూడు లక్షలకు పైగా మంది భక్తులు హిమాలయాల్లోని మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. ఆదివారం నాటికి 3.07 లక్షల మంది యాత్రికులు పవిత్ర దర్శనం చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఆగస్టు 9న యాత్ర ముగియనుంది. ఇంకా 20 రోజులు మిగిలి ఉన్నందున ఈ ఏడాది 3.50 లక్షలకు పైగా మంది భక్తులు దర్శనం చేసుకునే అవకాశం ఉందని అధికారిక అంచనా. సోమవారం భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి రెండు ఎస్కార్ట్ కాన్వాయ్‌లలో 3,791 మంది యాత్రికులు లోయకు బయలుదేరారు. 1,208 మంది యాత్రికులతో బాల్టాల్ బేస్ క్యాంప్‌కు 52 వాహనాలతో కూడిన మొదటి ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 3.33 గంటలకు బయలుదేరగా, 2,583 మంది యాత్రికులతో పహాల్గామ్ బేస్ క్యాంప్‌కు 96 వాహనాలతో కూడిన రెండవ ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 4.06 గంటలకు బయలుదేరిందని అధికారులు తెలిపారు.

## డెల్టా ఎయిర్ విమానాన్ని ఢీకొట్టబోయిన యుద్ధ విమానం

**ప్యారిస్,జూలై 22:** ఆకాశంలో పెను ప్రమాదం తప్పింది. ఒక ప్రయాణికుల విమానం.. యుద్ధ విమానాన్ని ఢీకొట్టే ఘటన త్రుటిలో తప్పింది. గత వారం జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పారిస్ నుంచి సిన్సినాటి నార్తర్న్ కెంటకీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న డెల్టా ఎయిర్ లైన్స్ విమానానికి అమెరికాకు చెందిన యుద్ధ విమానం బీ52 బాంబర్ అతి సమీపానికి వచ్చింది. అప్రమత్తమైన డెల్టా విమాన పైలట్ ఫ్లైట్‌ను వెంటనే కొన్ని అడుగుల కిందికి దించడంతో ప్రమాదం తప్పింది. యుద్ధ విమానం సమీపంలోకి వచ్చిన విషయాన్ని 'ఎవరూ మాకు చెప్పలేదు' అని పైలట్ చెప్పడం గమనార్హం. రాడార్ కంట్రోల్‌లో కమ్యూనికేషన్ లోపం కారణంగానే ఇది జరిగినట్టు తెలుస్తోంది. ఈ నెల 10న ఒక బీ52 హెచ్ స్ట్రాటోఫోర్ట్రస్ బాంబర్ సమీపంలోకి వచ్చి డెల్టా విమానాన్ని ఢీకొన్నంత పనిచేసింది. అప్పుడు డెల్టా విమానం 30 వేల అడుగుల ఎత్తులో ఎగురుతోంది. బీ52 విమానం సమీపంలో ఉందని గుర్తించిన పైలట్ వెంటనే అప్రమత్తమై అగ్రెసివ్ మాన్యువర్ చేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

## బోర్డును తప్పుగా ప్రదర్శించిన కండక్టర్ సస్పెన్షన్

**తిరువణ్ణామలై,జూలై 22:** తిరువణ్ణామలై వెళ్లే బస్సులో తిరువణ్ణామలైకి బదులుగా అరుణాచలం అని బోర్డు ప్రదర్శించినందుకు తమిళనాడు ఆర్టీసీ యాజమాన్యం ఒక కండక్టర్‌ను సస్పెండ్ చేసింది. ఈ సంఘటన ఈ నెల 15వ తేదీన చోటు చేసుకుంది. కళ్లకురిచ్చి ప్రభుత్వ రవాణా సంస్థ డిపో నుంచి ఒక బస్సు బెంగళూరుకు బయలుదేరింది. ఈ బస్సు ముందుభాగంలో ఎల్ఈడీ తెరపై తిరువణ్ణామలైకు బదులుగా అరుణాచలం అని ఆంగ్ల అక్షరాలలో ప్రదర్శించారు. దీనిని గమనించిన కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఒక సామాజిక కార్యకర్త ఈ విషయంపై ప్రభుత్వ రవాణా సంస్థను ప్రశ్నించారు.

## సాంబార్‌లో విషం కలిపి భర్తను హత్యచేసిన భార్య

**చెన్నై,జూలై 22:** దేశ వ్యాప్తంగా భర్తలను హతమారుస్తున్న భార్యల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. ఈ మధ్య కాలంలో ఈ ఘటనలు మరింత ఎక్కువయ్యాయి. తాజాగా తమిళనాడులో ఇదే కోవకు చెందిన ఘటన మరొకటి చోటుచేసుకుంది. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య తన భర్తను సాంబారులో విషం కలిపి హతమార్చింది.

## మంత్రి నారా లోకేష్‌కు వచ్చిన నోటు పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ



- చిలువూరులోని ఉర్దూ స్కూలు, బ్యాంకు స్కూలులో పంపిణీ చేయించిన మంత్రి నారా లోకేష్
- మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

**దుగ్గిరాల (జర్నలిస్ట్ ఫైల్) :** మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలవడానికి వచ్చిన వారు తీసుకువచ్చిన నోట్ పుస్తకాలను మంగళవారం చిలువూరు గ్రామంలోని ఉర్దూ స్కూలు, బ్యాంకు స్కూలులో విద్యార్థులకు స్థానిక నాయకుల ద్వారా పంపిణీ చేయించారు. మంత్రి నారా లోకేష్‌కు వచ్చిన నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ షేక్ జబీనా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యార్థులకు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, ఎంపీటీసీ రోజ మరియమ్మ, నాయకులు శేషగిరి, కృష్ణప్రసాద్, యేసుపాదం, జానీ బాషా, సలావుద్దీన్, అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లను సకాలంలో పూర్తి చేయాలి



**బ్రహ్మంగారి మఠం జర్నలిస్ట్ ఫైల్ :** పల్లె పండుగ క్రింద మంజూరైన సీసీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని పంచాయతీరాజ్ డిఈ మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో బదిలీల పై వచ్చిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి కూడా డిఈ తో పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో సోమిరెడ్డిపల్లి సహకార సంఘం చైర్మన్ గా ఎంపికైన యల్లటూరు సాంబశివారెడ్డి, కానాల మల్లికార్జున రెడ్డి, చిలమల నాగయ్య తదితరులు ఉన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- నగర కమిషనర్ అలీం బాష

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి లోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ అలీం బాష సూచించారు. రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా నగర పాలక సంస్థ ప్రత్యేక కాల్ సెంటర్ నెంబర్లు (08645–295193, 70939 12653) ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు ముంపుకు గురయ్యే ప్రాంత ప్రజలు కాల్ సెంటర్లకు ముందస్తు సమాచారం అందజేస్తే తగు పరిష్కారాలు చేపడతామని తెలిపారు. నగర ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు పొడి వేయరాదని కోరారు. మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ వైరల్ జ్వరాలు డయేరియా వంటి వ్యాధులు తరచుగా వచ్చే ప్రమాదం పొంచి ఉందని, ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బయట ఆహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీటిని త్రాగాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు, పరీక్షలు, ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, కావున ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అలీంబాషా కోరారు.

## అహోరాత్ర రుద్ర పారాయణం

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని పాత శివాలయంలో అర్చకసంఘం పురోహితుల ఆధ్వర్యంలో చేపట్టిన అహోరాత్ర రుద్ర పారాయణం విజయవంతంగా జరిగింది. సోమవారం ఉదయం 10గంటల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు ఎంతో గొప్పగా నిర్వహించిన బ్రహ్మణులు, అర్చక పురోహితులు అందర్నీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఈ విధంగా చక్కటి హెూమాలు, యజ్ఞాలు, రుద్రహెూమం, లక్ష్మీగణపతి హెూమం చక్కగా నిర్వహించడం ఎంతో మంచివిషయం అన్నారు. వాటి ద్వారా రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, పల్నాడు జిల్లా అభివృద్ధిలో ముందుకు పోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా అన్నారు. అహోరాత్ర రుద్ర పారాయణం గొప్ప ఫలితాలు ఇవ్వాలని, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబుకి బలం, అవకాశాలను ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు పురోహిత సంఘం సభ్యులు, రమణారావు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ అచ్యుతానందన్ మృతికి సంతాపం




**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారిమఠం మండలం లోని సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్ అచ్యుతానందన్ మరణించడం పట్ల సంతాపాన్ని తెలిపి ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు అచ్యుతానందన్ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎర్ర సూరీడు ఎందరో రాజకీయ నాయకులు కు స్ఫూర్తి ప్రదాత, ఆదర్శ నేత కరుడుగట్టిన కేమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ అచ్యుతానంద అన్నారు. కామ్రేడ్ అచ్యుతానందన్ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడిగా అనేక పోరాటాల్లో కీలకమైన వ్యక్తిగా వ్యవహరించారు 17 సంవత్సరాలకే కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడిగా చేరారు కామ్రేడ్ కృష్ణ పిల్లే నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారు.

## ఏపీలో యువత కోసం ప్రత్యేక కృషి చేస్తున్న మంత్రి లోకేష్ - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించిన ఏపీ స్కిల్ డెవెలప్మెంట్ అధికారులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లో యువత భవిష్యత్తు కోసం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేట మాస్టర్ మైండ్స్ క్యాంపస్ లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవెలప్మెంట్ వారి సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ జాబ్ మేళాను ప్రారంభించి, వారితో ముచ్చటించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ ఇంటర్వ్యూ లలో 378 మంది ఎంపిక అయ్యారు. వారందరికీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గారు, స్కిల్ డెవెలప్మెంట్ అధికారి సంజయ్ గారు, మేయర్ కోవెలమూడి రవీంద్ర గారు, మాస్టర్ మైండ్స్ మోహన్ కృష్ణ గారి సహకారంతో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసుకోవటం ఆనందంగా ఉంది. ఈ జాబ్ మేళాకు 378 మంది నిరుద్యోగ యువత ఎంపికయ్యారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గము నుండే కాక ఇతర ప్రాంతాల నుండి యువత ఇంటర్వ్యూకు వచ్చారు. వచ్చిన యువతకు వారి అర్హతను బట్టి రూ. 10,000 – 40,000 వేల వరకు జీతాలు చెల్లించటానికి వచ్చిన కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కిల్ డెవెలప్మెంట్ కేంద్రాల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీని ప్రధాన ఉద్దేశం రానున్న 5 ఏళ్ళలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాము. ఈ జాబ్ మేళాకు ఎంపిక అవ్వని అభ్యర్థులకు స్కిల్ డెవెలప్మెంట్ ద్వారా నైపుణ్యాలు పెంచి వారిని ఒక ఉద్యోగిగా లేక వ్యాపారస్తుడిగా మార్చాలని చంద్రబాబునాయుడు గారు కృత నిశ్చయంతో పనిచేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని, ఈ మెగా జాబ్ మేళా విజయవంతం అవ్వటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు చంద్రముని, విజయ్ లక్ష్మీ, దుర్గా బాయి తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఆరోగ్యం - జంపనిలో డెంగ్యూ నివారణ మాసోత్సవం

- తెనాలి సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ సూచనలు



**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** వేమూరు మండలం జంపనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిమంచి బదరీనారాయణ సహకారం అందించగా, ముఖ్య అతిథిగా తెనాలి పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిలకడగా ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెట్టి పెరుగుతాయని, వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడు వాపు, బోదకాలువ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. దోమ గుడ్ల నుంచి పెద్ద దోమలుగా మారటానికి 8–10 రోజులు పడుతుందని, ప్రతి వారంలో ఒకసారి నీటి నిల్వలను మార్చడం, నీటి పై మూతలు వేసే అలవాటు ద్వారా వాటి వృద్ధిని అడ్డుకోవచ్చన్నారు. డెంగ్యూ లక్షణాల విషయానికొస్తే... అధిక ఉష్ణోగ్రత, కండరాల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి, శరీరంపై దద్దుర్లు, కొన్ని సందర్భాల్లో ముక్కు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, ఎర్రగా మూత్రం రావడం, మలంలో రక్తం కనిపించడాన్ని పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, ఉచితంగా మందులు కూడా లభిస్తాయన్నారు. పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి పున్నారావు మాట్లాడుతూ, దోమలు తమ గుడ్లను గాబులు, తొట్లు, డ్రమ్ములు, కూలర్లు, ఫ్రిజ్ వెనుక ట్రేలు, పూల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులలో పెడతాయని వివరించారు. తెనాలి గ్రామీణ సబ్‌యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ, "చెక్–క్లీన్–కవర్" విధానాన్ని పాటించడం ద్వారా దోమల వృద్ధిని అడ్డుకోవచ్చన్నారు. ప్రజలు సొంతంగా వైద్యం చేసుకోవద్దని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో డెంగ్యూ వ్యతిరేక ప్రతిజ్ఞ తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బదరీనారాయణ మాట్లాడుతూ, ప్రజలంతా ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరామయ్య, పర్యవేక్షకురాలు శోభారాణి, విలేజ్ హెల్త్ సెక్రటరీస్ మాధవి, ఝాన్సీరాణి, ఎంఎల్హెచ్పి దివ్య, ఆశా కార్యకర్తలు సుమతి, లత తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కార్మికులసమ్మెకు పారిశుధ్య కార్మికుల సంఘీభావం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** న్యాయమైన కోర్కెల సాధనకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె పట్ల, ప్రభుత్వం, యూనియన్ నాయకులతో చర్చించకుండా, జీవో నెంబర్ 124 అంటూ మరో జీవోను విడుదల చేయడం సరైన విధానం కాదంటూ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. తెనాలిలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వాటర్ హెడ్ ట్యాంక్ దగ్గర చేపట్టిన సమ్మె మంగళవారం కు,ఏడవ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు మానవహారంగా ఏర్పడి, ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు తమ సంఘీభావాన్ని తెలిజేస్తు నినాదాలు చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయమైన కోరికలు నెరవేర్చకుండా, సమ్మె జరుగుతున్నప్పుడు యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చించకుండా జీవో నెంబర్ 124 అంటూ మరో జీవోను విడుదల చేయడం సరైన తీరు కాదని మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు మంగళగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వ విధానంపై తమ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు బాబు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన 36 జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్న న్యాయమైన కోర్కెలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పరిపాలన విధానానికి భిన్నంగా మరొక జీవోను విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. 2012 నుండి విడుదలైన జీవోలను వివరిస్తూ, గతంలో విడుదల చేసిన జీవోలకు విలువ లేదా అంటూ ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘ నాయకులు తమకు సంఘీభావం తెలిపిన పారిశుధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

## విపత్తు లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** విపత్తులు, విపత్కర సమయాలలో ప్రజలు ఏ విధంగా తమ ప్రాణాలను కాపాడుకోవచ్చు అనే అంశాల గురించి ప్రజలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమం లో భాగంగా విపత్తుల సమయంలో ప్రమాదాల నివారణపై అవగాహన, వరదల్లో చిక్కుకున్న ప్రజలను రోడ్డు ప్రమాదంలో ఏదైనా జరిగితే ఎలా కాపాడుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి.వెంకట స్వామి ,రెవెన్యూ సిబ్బంది, నక్కల.అగస్టిన్ ,ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండూ శూన్యం

- ప్రతిగ్రామంలో రచ్చబండ సభలు పెడదాం
- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



**తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్)** జగన్ ప్రభుత్వం కన్నా మెరుగైన సంక్షేమం ఇస్తామంటూ, నాడు ప్రజలను నమ్మించి, నేడు కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని, గ్రామస్థాయి నుండి కూటమి ప్రభుత్వ మోసాలను బట్టబయలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతిగ్రామంలో రచ్చబండ పెడదామని తెనాలి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు
స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన, బాబు షూరిటి మోసం గ్యారంటీ, కార్యక్రమాన్ని, ఈ నెలాఖరులోగా, గ్రామ స్థాయిలో నిర్వహించే కార్యాచరణ పై సమావేశం నిర్వహించారు. మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాస రావు అధ్యక్షత వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తమ సుదీర్ఘ ఉపన్యాసంలో గ్రామస్థాయి కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి, కూటమి ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమంపై ఆరా తీయాలన్నారు. తెనాలి నియోజకవర్గంలో నాడు అధికారంలో ఉన్న సమయంలోను, ప్రతిపక్షంలో ఉన్న సమయంలోను, ప్రతి గడపకు వెళ్లి ప్రజల పరిస్థితులు తెలుసుకున్నామని, అదే స్ఫూర్తితో గ్రామస్థాయిలో కూటమి ప్రభుత్వం గారడీని ఎండగట్టేందుకు ఇదో అవకాశం అన్నారు. గడిచిన సంవత్సర కాలంలో కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదు అన్నారు. నియోజకవర్గంలో ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ మోసపూరితమన్నారు. ఈ అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా నేటి ప్రభుత్వం మేలుకొని సంక్షేమం పంపిణీ చేస్తుందని, ఆ విధంగా కూడా మనకు ప్రజల్లో గుర్తింపు వస్తుందన్న భావనను శివకుమార్ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో కూడిన క్యూఆర్ కోడ్ ను, ఆవిష్కరించారు. కోటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో ఎన్ని అమలు చేశారు ఈ సంవత్సర కాలంలో ప్రజలకు ఎన్ని చేరువయ్యాయి అనే వివరాలను ప్రజాక్షేత్రంలోని వివరించే విధంగా క్యూఆర్ కోడ్ను వైఎస్ఆర్సిపి రాష్ట్ర పార్టీ రూపొందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధర్మరాజులు చెన్నకేశవులు జడ్పిటిసి పిల్లి ఉమా ప్రణతి తాడిబోయిన ఎలమంద, మండల యువత అధ్యక్షులు కుర్రా జస్వంత్, మండల బీసీ సెల్ అధ్యక్షులు కే స్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పినపాటి రవి కిరణ్, మండల మైనార్టీ విభాగం నాయకులు షేక్ కాజా, శంకర్ తదితర పార్టీలోని వివిధస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ఉండాలి



- గుంటూరులో భారీ ప్రాజెక్టులు చేపట్టాం
- వర్షాకాలంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- ఇంజనీరింగ్ అధికారులతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షించాలని చెప్పారు. పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ? ఇంకా ఎంత శాతం పూర్తవ్వాలి ? ఎన్ని రోజులు సమయం తీసుకుంటుంది ? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నగరంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భారీ ప్రాజెక్టులు చేపట్టామని, ఇవి గుంటూరు నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వీటి నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు.


## డ్రైన్ల ఆక్రమణలను సహించేది లేదు



- ఆక్రమణల తొలగింపుపై యుద్ధప్రాతిపదికన చర్యలు
- కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలంలో మురుగు నీరు సక్రమంగా పారేందుకు ప్రధాన రహదారులపై ఉన్న డ్రైన్లను పూర్తిగా శుభ్రం చేసేందుకు గుంటూరు నగరపాలక సంస్థ చర్యలు ప్రారంభించింది. డ్రైన్లపై, వాటి ముందు ఉన్న అక్రమ నిర్మాణాలు, అడ్డంకులను తొలగించడంలో రాజీ లేదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నల్ల చెరువు మెయిన్ రోడ్‌లో అన్న క్యాంటీన్ నుండి పీకల వాగు వరకు రెండు వైపులా కమిషనర్ స్వయంగా పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, డ్రైన్లపై ఉన్న అన్ని ఆక్రమణలను శాతానికి శాతం తొలగించాలని, వార్డ్ సచివాలయాల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు.
కమిషనర్ మాట్లాడుతూ... ఇప్పటికే డ్రైన్లలో పూడికతీత పనులు జరుగుతున్నప్పటికీ, అక్రమ నిర్మాణాల వల్ల పనులు పూర్తికాలేకపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా నల్లచెరువు మెయిన్ రోడ్ లో మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్‌పై ఉన్న ఆక్రమణల వలన శుద్ధి పనులు స్తంభించాయని, అందుకే వర్షాల సమయంలో కాలువల ద్వారా నీరు వెళ్లక ప్రజల ఇళ్లలోకి ప్రవేశించి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. ఆక్రమణలపై పట్టణ ప్రణాళిక అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, తొలగింపు అనంతరం పూర్తిస్థాయిలో పూడికతీత చేపట్టాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే, తొలగించిన ప్రాంతాల్లో పునఃఆక్రమణలు చోటుచేసుకోకుండా తగిన పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి వెంకటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణతో పాటు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



- బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేసిన నాయకులు

**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును టీడీపీ నాయకులు మంగళవారం అందజేశారు. వెజిటెబుల్ మార్కెట్‌కు ప్రాంతానికి చెందిన మన్యం వీరరాఘవమ్మ మృతి చెందగా ఆమె పేరుపై మంజూరైన రూ. 40,000 వేల విలువైన చెక్కును మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా మంత్రి నారా లోకేష్ సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేయించి బాధితులకు అందజేయిస్తున్నారని చెప్పారు. వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ వాకా మంగారావు, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మ, పట్టణ తెలుగుయువత కార్యదర్శి గౌరీశంకర్, బూత్ కన్వీనర్లు దామర్ల రాంబాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మంగళగిరిలో 50వేల మంది పనిచేసేందుకు అవకాశం!

- ఐటీ, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి
- రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టండి!
- నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం!
- మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్షలో మంత్రి నారా లోకేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఐటీ, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, భవిష్యత్ లో 50వేల మంది పనిచేసేందుకు అవకాశం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై అధికారులు దృష్టిసారించాలన్నారు. మంగళగిరిలో వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇళ్ల పట్టాల విషయంలోనూ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం!:** ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉంది, ఇందుకు అవసరమైన స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజక వర్గంలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. తాడేపల్లి రిటైనింగ్ వాల్, మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, మోడ్రన్ లైబ్రరీ, పార్క్ లు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులపైనా మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం : ఎమ్మెల్యే నసీర్

- సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆదుకుంటున్నాం
- పేదల ఆరోగ్యమే ప్రథమ లక్ష్యం
- 50 మందికి రూ.71 లక్షల విలువైన చెక్కుల పంపిణీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వమని, అందుకే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుల వారి కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.70,72,179 విలువైన చెక్కులను ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. వీటిలో సీఎంఆర్ ఎఫ్ రూ.40,57,179, ఎల్వోసీ(వైద్యానికి ముందుస్తు నిధులు) రూ.30.15 లక్షలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ పండ్ ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. కనీసం సీఎం రిలీఫ్ ఫండ్ కూడా అందించకుండా పేదల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నామని వెల్లడించారు. తమ వద్దకు వచ్చిన బాధితులకు ఓదార్పుగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.3.50 కోట్ల నిధులు అందజేశామని, ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఆస్పత్రుల్లో లక్షల రూపాయల ఖర్చయ్యాయని, అప్పుల్లో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే నసీర్ ను సంప్రదించిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

# గుంటూరు సిజిహెచ్ఎస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గా డాక్టర్ విద్య



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్ఎస్) గుంటూరు వెల్నెస్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గా డాక్టర్ విద్య నియమితులయ్యారు. కలెక్టరేట్ ఎదురుగా గల సిజిహెచ్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆమె బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సిజిహెచ్ఎస్ నుండి బదిలీపై ఆమె గుంటూరుకు వచ్చారు. నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విద్య ను సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్య మాట్లాడుతూ..ఉద్యోగులు, పెన్షనర్ల పాలిట సంజీవిని సిజిహెచ్ఎస్ ను తీర్చిదిద్దటానికి తన వంతు కృషి చేస్తానన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వారికి తగిన ప్రాధాన్యతను ఇస్తానన్నారు. నాణ్యమైన మెరుగైన వైద్య సేవలందించటమే తమ లక్ష్యమన్నారు. వైద్య పరంగా అభివృద్ధి చెందిన గుంటూరులో సేవ చేసే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.వివేకానంద మాట్లాడుతూ అందరూ అభిమానించే వైద్యురాలుగా డాక్టర్ విద్య మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. వైద్య వృత్తి అంటే సామాజిక సేవాభావంతో చేస్తున్న మహోపకారమన్నారు.

సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ..ప్రతి వైద్యునికి సేవే కాకుండా, సంభాషణ శైలీ అవసరమన్నారు. వైద్యుడు ఇచ్చే భరోసా రోగి పూర్తి ఆరోగ్యవంతుడు అవ్వడానికి దోహదపడుతుందన్నారు. రోగుల బాగోగులు చూసే వైద్యులే ప్రజల పాలిట కనిపించే దైవాలన్నారు. అనంతరం డాక్టర్ విద్య కు పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. తొలుత సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సిహెచ్. కోటేశ్వరరావును డాక్టర్ విద్య మర్యాద పూర్వకంగా కలిసి, ఆయన ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, జిఎస్టీ పెన్షనర్స్ సంఘం నేతలు గద్దె తిలక్, టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్యచౌదరి, పి.వి.సత్యనారాయణ, కె.సామ్రాజ్యం, పి.కోటేశ్వరరావు, ఎన్.ఎస్.నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ సహకారంతో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

- స్త్రీ శక్తి సంక్షేమం పేరుతో మహిళలకు ఉచితంగా శిక్షణ, కుట్టు మిషన్లు అందిస్తున్న మంత్రి నారా లోకేష్
- శిక్షణ పొందిన "70"వ బ్యాచ్ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ
- కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేసిన నియోజకవర్గ తెలుగు మహిళలు



**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** మానవ వనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 70వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. మంత్రి నారా లోకేష్‌కు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి సాధించడం ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలబడతాయన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ స్త్రీ శక్తిని నెలకొల్పి ఉచితంగా మహిళకు కుట్టుమిషన్లు అందజేస్తు న్నట్లు చెప్పారు. మంత్రి నారా లోకేష్ కృషితో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి నారా లోకేష్ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ హయాంలో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటే మంత్రి నారా లోకేష్ గెలిచిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మంగళగిరి నియోజక వర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, నియోజకవర్గం తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపుడి వైష్ణవి, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, మంగళగిరి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు లావణ్య, మార్కెట్ కమిటీ సభ్యులు భైరబోయిన పద్మ, నైనాల లావణ్య, నక్కా రాజేశ్వరి, గడ్డిపాటి తులసి,

## గుంటూరులో రేంజ్ ఐజీని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రొబేషనరీ సివిల్ ఎస్సైలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** శిక్షణ పూర్తిచేసుకున్న ప్రొబేషనరీ సివిల్ ఎస్సైలు మంగళవారం గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమం రేంజ్ ఐజీ కార్యాలయంలో నిర్వహించబడింది. మొత్తం 53 మంది ప్రొబేషనరీ ఎస్సైలు ఈ సందర్భంగా హాజరయ్యారు. వీరిలో 36 మంది పురుషులు, 17 మంది మహిళలు ఉండగా, వారిని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో విధుల కోసం నియమించారు. ఈ సందర్భంగా రేంజ్ ఐజీ మాట్లాడుతూ, పోలీస్ విభాగంలో చేరిన ప్రతి అధికారి విధి నిర్వహణలో నిజాయతీ, నిబద్ధత, సేవా తత్పరతతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో ఎదుగుదల కోసం అధికారులు నిరంతరం నేర్చుకుంటూ ఉండాలని సూచించాడు. పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహణలో పాలనాపరమైన విధానాలు, రికార్డుల నిర్వహణ, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అభిప్రాయపడ్డాడు. ప్రజలతో మరియు సహచర ఉద్యోగులతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరచుకున్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని తెలిపాడు. శిక్షణలో వారు నేర్చుకున్న విషయాలపై ప్రశ్నలు అడిగి, వారి స్పందన ద్వారా సేవాపరమైన దృక్పథాన్ని పరిశీలించాడు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు కూడా పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లాలో విధుల్లో చేరిన 29 మంది ఎస్సైలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నాడు కొత్తగా నియమితులైన 23 మంది ప్రొబేషనరీ సబ్-ఇన్‌స్పెక్టర్లు మరియు పదోన్నతి పొందిన 6 మంది ప్రమోటి ఎస్సైలు అధికారికంగా విధుల్లో చేరారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారంతా రిపోర్ట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన, ప్రజలతో స్పందన, సేవా తత్పరత ఎంతో కీలకమని స్పష్టం చేశాడు. యువ ఎస్సైలు తీసుకొచ్చే తాజా శక్తి, పట్టుదల, బాధ్యతాయుతమైన దృక్పథం గుంటూరు జిల్లా పోలీస్ సేవలకు నూతన ఉత్సాహాన్ని నింపుతుందని అభిప్రాయపడ్డాడు. అలాగే ప్రమోటి ఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ల అనుభవం, కార్యనిర్వహణ నైపుణ్యం పోలీసింగ్‌ను మరింత మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. కొత్తగా చేరిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్పీ, వారు తమ విధుల్లో అత్యుత్తమంగా నిబద్ధతతో పనిచేసేందుకు పూర్తి ప్రోత్సాహం ఇస్తామన్నారు.

# పొదుపు సంఘాలతో పురుషులకూ రుణం - నిబంధనలు ఇవే

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణ పేదరిక నిర్మూలన పథకంలో భాగంగా ఇప్పటి వరకు మహిళలకు పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి వారికి రుణ వసతి కల్పిస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పురుషులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో జీవించే అసంఘటిత కార్మికులతో సంఘాలు ఏర్పాటు చేసి, వారికి రుణ సౌకర్యం కల్పించి సమృద్ధిగా ఆదాయం పెంపొందించడమే ఈ పథకం ఉద్దేశం. ఈ క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తొలి విడతగా మండపేట, అమలాపురం, రామచంద్రపురం, ముమ్మిడివరం పట్టణాల్లో మొత్తం 38 పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. పొదుపు చేసిన వారికి రుణ సౌకర్యం కల్పిస్తున్నారు.

**5 నుంచి 10 మంది సభ్యులతో:** పట్టణాల్లో జీవించే అసంఘటిత కార్మికులతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని భవన నిర్మాణ రంగం, రిక్షా కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, కేర్ టేకర్లు, వృత్తి పనివారు, ఏసీ, వాషింగ్ మిషన్లు, రిఫ్రిజిరేటర్ నిపుణులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, సెలూన్ నిర్వాహకులు వంటి వివిధ రకాల పనులు చేసే వారిని మెప్మా ఆర్పీల ద్వారా గుర్తించారు. పొదుపు సంఘాల వల్ల కలిగే ఉపయోగాలను తెలిపి 5 నుంచి 10 మంది సభ్యులతో గ్రూపులుగా ఏర్పాటు చేయించారు.

**38 గ్రూపులు ఏర్పాటు:** ఇప్పటి వరకు కోనసీమ జిల్లాలో 38 గ్రూపులు ఏర్పాటు చేశామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎవరైనా కొత్తగా ఏర్పాటు అయ్యేందుకు అవకాశం ఉంది. కాకపోతే నిబంధనల మేరకు 6 నెలలు పొదుపు చేస్తే బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తాం. సభ్యులు ఎప్పటికప్పుడు తీసుకున్న బ్యాంకు రుణాలు క్రమం తప్పకుండా చెల్లిస్తే వారికి ఇచ్చే రుణాన్ని పెంచుతాం.

**రుణానికి ప్రభుత్వమే వడ్డీ మాఫీ:** వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ పథకం మొదలు కానుంది. రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ నగరాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నారు. ఇప్పటికే 2841 గ్రూపులను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని గ్రూపులు ఇప్పటికే పొదుపు ప్రారంభించాయి. వీరందరికీ త్వరలో రుణాలు మంజూరు చేయనున్నారు. ప్రతి సభ్యుడు నెలకు కనీసం రూ.100 పొదుపు చేయాలి. 3 నెలలపాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ కింద రూ.25,000లు అందిస్తుంది. ఈ రుణానికి ప్రభుత్వమే వడ్డీ మాఫీ చేస్తోంది.

# సీఎం గారూ... మీ ప్రజాప్రతినిధులు హద్దుమీరుతున్నారు...అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు

- ప్రజాప్రతినిధి వేషంలో ఉద్యోగులపై దౌర్జన్యం... తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం!
- జేసీ అనుచిత ప్రవర్తనపై ... ఏపీ జేఏసీ అమరావతి తీవ్ర మండిపాటు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) టి. నాగరాజు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర నిరాశ కలిగించాయని, అసభ్య పదజాలంతో అధికారిని దూషించడం ప్రభుత్వ యంత్రాంగాన్ని కించపరచే చర్యగా ఏపీ జేఏసీ అమరావతి ఖండించింది. ప్రజాప్రతినిధులే ఉద్యోగులపై దాడులకు సిద్ధపడితే, పరిపాలనా వ్యవస్థ ఎలా నడుస్తుందనే ప్రశ్నను జేఏసీ నేతలు లేవనెత్తారు.

ఈ ఘటనపై ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి కనపర్తి సంగీతారావు మంగళవారం ఒక ప్రకటనలో స్పందించారు.

విధి నిర్వహణలో ఉన్న జిల్లా స్థాయి అధికారిపై బహిరంగంగా అసభ్య వ్యాఖ్యలు చేయడం, ప్రభుత్వ ఉద్యోగులందరిలో భయభ్రాంతులు, అసంతృప్తి కలిగించే విధంగా ఉందని, ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా ఖండించారు.

**"ఇది వాక్ స్వాతంత్రం కాదు, అధికార వ్యవస్థను కూల్చే కుట్ర"**

జెసి ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాక్ స్వాతంత్రం పేరిట సమర్థించదగినవి కావని, అధికారులను సామాన్యంగా చూడటం, బెదిరించడం, దూషించడం ఊహించని స్థాయికి చేరిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఉద్యోగుల గౌరవాన్ని తుళ్ళించే చర్య మాత్రమే కాకుండా, భవిష్యత్తు తరాలకు తప్పుడు సంకేతాలను ఇస్తోందని హెచ్చరించారు.

ఒక అధికారి విధుల్లో తప్పు చేస్తే, చట్టబద్ధంగా ఫిర్యాదు చేయవచ్చు. ప్రశ్నించవచ్చు. కానీ బహిరంగంగా దుర్భాషలాడడం, అధికార ప్రతిష్టను కాలరాస్తూ మాట్లాడడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించదగినది కాదని జేఏసీ స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తం మీద ఒత్తిడి తెస్తాయన్నారు.

**జేఏసీ అనంతపురం ప్రతినిధుల పరామర్శ**

ఈ ఘటన వెలుగులోకి వచ్చాక, రాష్ట్ర నాయకత్వ సూచనల మేరకు అనంతపురం జిల్లా జేఏసీ అమరావతి చైర్మన్ ఆర్.ఎన్.దివాకర్, జనరల్ సెక్రటరీ పి.ఎస్. ఖాన్ నేతృత్వంలో వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు డిపిఓ టి. నాగరాజుని కలిసి సంఘీభావం తెలిపారు. జేఏసీ తరఫున అతనికి మద్దతుగా ఉంటామని, ఇటువంటి దాడులపై ఏ పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని తెలియజేశారు.

**సీఎం తక్షణంగా జోక్యం చేసుకోవాలి**

ఇలాంటి ఘటనలను ఉపేక్షిస్తే, రేపు మరికొంతమంది ప్రజాప్రతినిధులు కూడా అదే బాట పట్టే ప్రమాదం ఉందని జేఏసీ హెచ్చరించింది. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, బాధ్యతాయుతంగా వ్యవహరించి, జెసి ప్రభాకర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్నవారన్నారు. వారిపై దాడులను ప్రోత్సహించే విధంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని జేఏసీ తేల్చిచెప్పింది. ఉద్యోగుల గౌరవాన్ని కాపాడడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా ముందుకు రావాలని కోరింది.

# ప్రకాశం జిల్లాలో విమానాశ్రయం - డీపీఆర్ రూపకల్పనలో అధికారులు



**ప్రకాశం జిల్లా, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకాశం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో దిల్లీ నుంచి ప్రత్యేక బృందం కొత్తపట్నంలో పర్యటించారు. ప్రతిపాదిత నమూనాలో కొద్దిపాటి మార్పులను చేపట్టి విమానాశ్రయ ఏర్పాటు సాధ్యమేనని వారు సానుకూలతను వ్యక్తం చేశారు. ఇటీవల ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని (ఏపీఏడీసీఎల్) ప్రకటన వెలువరించింది. డీపీఆర్ రూపకల్పన పూర్తయితే భూసేకరణ దిశగా అడుగులు పడనున్నాయి.

1,086 ఎకరాల సేకరణకు ప్రతిపాదన: విమానాశ్రయం మొదటి దశ నిర్మాణం కోసం 657 ఎకరాల భూసేకరణకు రెవెన్యూ శాఖాధికారులు ప్రతిపాదనలను రూపొందించారు. ఇందులో సుమారు 551 ఎకరాలు వాన్‌పిక్‌కు సంబంధించిన భూమి కాగా, 103 ఎకరాలు పట్టా భూమి, 12 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించారు. మొదటి విడత భూ భూసేకరణకు గాను సుమారుగా రూ.102కోట్ల పరిహారం అవసరం కానుందని అధికారులు లెక్కలు తేల్చారు. అందుకు అనుగుణంగా భూ వివరాలను సబ్‌డివిజన్ వారీగా పరిహారాన్ని ఎంతెంత ఇవ్వాలనేది ప్రభుత్వానికి నివేదించారు. జనవరిలో కొత్తపట్నం మండలం అల్లూరుకు వచ్చిన కేంద్ర విమానయాన సంస్థ కమిటీ సభ్యులను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కలిసి విమానాశ్రయం ఆవశ్యకతను వివరించారు. విమానాశ్రయానికి ప్రతిపాదించిన ప్రాంతానికి సంబంధించి మ్యాపును పరిశీలించిన కమిటీ సభ్యులు కొన్ని మార్పులను సూచించారు. ఈ మేరకు విమానాశ్రయం ఏర్పాటు సానుకూలమేనన్న అభిప్రాయాన్ని కమిటీ సభ్యులు వ్యక్తం చేశారు. విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు భూ సేకరణపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి మొత్తం 1,086 ఎకరాలు అవసరమని తేల్చారు. కొత్తపట్నం మండలంలోని గ్రామాల వారీగా ఏ సర్వే నంబర్లలో ఎంత భూమి ఉందనేది గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ భూమి ఎంత? పట్టా భూమి ఎన్ని ఎకరాలు, మొదలైన తదితర వివరాలను నమోదు చేశారు.

డీపీఆర్ వస్తే వేగంగా పనులు: ఏపీఏడీసీఎల్ ప్రకటన శుభపరిణామని జిల్లా సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. డీపీఆర్ పూర్తయితే తదుపరి భూసేకరణ దిశగా అడుగులు పడతాయని గోపాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు భూ సేకరణకు ప్రకటన ఇస్తామని పేర్కొన్నారు. ఇందుకు ప్రత్యేకాధికారిని నియమిస్తాం. గ్రామాల వారీగా వివరాలను ఇప్పటికే సేకరించాం. పరిహారం ఎంతనేది అంచనా వేస్తామని వివరించారు.

ఒంగోలు ఎయిర్‌పోర్టుకు అనుకూలం: వాణిజ్య పరంగా ప్రకాశం జిల్లాకు గుర్తింపు ఉంది. జిల్లాలో ప్రధానంగా గ్రానైట్, పొగాకు వంటి అంతర్జాతీయ వ్యాపారాలు, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ, ఉపాధిని పొందేవారి సంఖ్య గణనీయంగా ఉంది. సమీపంలో రామయ్యపట్నం పోర్టు నిర్మాణం జరగడం, దీనికి తోడు సముద్ర తీరం కూడా అతి సమీపంలో ఉండటం వంటి మొదలైన కారణాల వల్ల ఒంగోలు ఎయిర్?పోర్టు నిర్మాణానికి అన్ని విధాలా అనుకూలమని ప్రజాప్రతినిధులు పట్టుమీద ఉన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాల్సిందిగా పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పెద్దలను కలిసి విన్నపాలను అందించారు. 32

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467